ఏలూరు ఉష్ణోగ్రతలు
గరిష్ఠం : 36.0
కనిష్ఠం : 19.0



ఏలూరు పోణంగి రోడ్డులోని టిడ్కో ఇళ్ల దుస్థితి

టిడ్కో వల!

ఓట్ల కోసం వైసీపీ ఎత్తుగడలు

ఎన్నికల ముంచుకొస్తున్న వేళ వైసీపీ ప్రభుత్వానికి టిడ్కో ఇళ్లు గుర్తుకొచ్చాయి. లబ్ధిదారులకు ఇచ్చేస్తున్నామంటూ హడావుడి చేస్తూ పేదల ఇంటి కలపై ఓట్ల కోసం వల విసురుతోంది. అయితే క్షేత్రస్థాయిలో పరిస్థితులు చూస్తే పట్టణ పేదలకు సొంతింటి కల ఇప్పట్లో నెరవేరేలా కనిపించడం లేదు. గత ఎన్నికలకు ముందే టిడ్కో గృహాలు చేతికొస్తాయని లబ్ధిదారులు భావించారు. అప్పటి టీడీపీ ప్రభుత్వం టిడ్కో గృహ నిర్మాణాలను 80 శాతం వరకు పూర్తి చేసిన తరుణంలో ఎన్నికల కోడ్ రావడంతో నిర్మాణాలు ఆగిపోయాయి. అనంతరం అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం మిగిలిన 20 శాతం పూర్తి చేసి గృహాలను అప్పగిస్తారని లబ్ధిదారులు భావించారు. అయితే వారి ఆశలు అడియాశలయ్యాయి. ఈ ఐదేళ్లలో వైసీపీ ప్రభుత్వం ఆ వైపే చూడకపోవడంతో ఆ గృహాలు పాడు పడిపోయాయి. మరోవైపు తీసుకున్న రుణాలు కట్టాలంటూ బ్యాంకులు లబ్ధిదారులకు నోటీసులు ఇస్తున్నాయి.

- ఐదేళ్లుగా పట్టించుకోని ప్రభుత్వం
- ఎన్నికల వేళ లబ్ధిదారులపై ఎనలేని ప్రేమ
- పాడైపోయిన టిడ్కో గృహాలు
- ఇంట్లోకి వెళ్లకముందే అప్పుల భారం
- నోటీసులు ఇస్తున్న బ్యాంకులు
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

ఏలూరులో 2,208 ఇళ్లే ఇస్తారట..

ఏలూరు టూటౌన్ : ఏలూరులో టిడ్కో ఇళ్లు అధ్వానంగా మారాయి. ఇళ్లల్లో పుట్టలు పెరిగి పాములు నివాసం ఉంటున్నాయి. పిచ్చిచెట్లు, ముళ్లపొదలు పెరిగిపోయాయి. శ్లాబ్‌లు పెచ్చులు ఊడిపోతున్నాయి. ఇటీవల కొన్ని పనులు మొదలుపెట్టి శుభ్రం చేసే ప్రయత్నాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే మౌలిక సదుపాయాలు కరువయ్యాయి. తాగునీటి సౌకర్యం లేకపోవడం, డ్రెయిన్లు, రహదారులు లేకపోవడంతో ఈ ఎన్నికలలోపు కూడా లబ్ధిదారులకు ఆ గృహాలు అప్పగించే పరిస్థితి లేకుండా పోయింది. టీడీపీ ప్రభుత్వ హయాంలో టిడ్కో పథకంలో 6,480 గృహాలు నిర్మాణాలను ప్రారంభిం ర్భు 4,272 గృహాలు నిర్మాణం ఫౌండేషన్ స్థాయిలోనే ఉన్నాయని వైసీపీ ప్రభుత్వం వాటిని రద్దు చేసి లబ్ధిదారులను భయపెట్టి జగనన్న కాలనీలో సెంటు భూమిని కట్టబెట్టారు. లబ్ధిదారులు 430 గజాల ఇళ్లకు రూ.లక్ష, 365 గజాల ఇళ్లకు రూ.50 వేలు, 300 గజాల గృహాలకు రూ.500 ప్రభుత్వానికి చెల్లించారు. బ్యాంకులలో వారికి రుణాలు మంజూరు చేస్తున్నట్టు అగ్రిమెంట్లు చేసుకున్నారు. ప్రస్తుతం 300 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు, 1104, 365 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 384, 400 ఎస్‌ఎఫ్‌టీ గృహాలు 720 కాగా మొత్తం 2,208 గృహాలే లబ్ధిదారులకు ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. అదికూడా మళ్లీ ఎన్నికల తర్వాతే లబ్ధిదారులకు అప్పగిస్తామని అధికారులు చెప్పడం గమనార్హం. 'టిడ్కో గృహాలను శుభ్రపరుస్తున్నాం. మౌలిక సదుపాయాల ఏర్పాటుకు కృషి చేస్తున్నాం. లబ్ధిదారులకు ఆరునెలల తర్వాత గృహాలు అప్పగిస్తాం'.. అని టిడ్కో ఈఈ స్వామినాయుడు తెలిపారు

అప్పు కట్టండి.. బ్యాంకులు నోటీసులు

నూజివీడు టౌన్ : ప్రభుత్వం మంజూరు చేసిన గృహాల్లోకి ఇంకా వారు అడుగుపెట్టలేదు. ఇంతలోనే ఇళ్లకోసం చేసిన అప్పు చెల్లించాలని బ్యాంకులు నోటీసులు అందిస్తున్నాయి. తీసుకున్న రుణాన్ని తక్షణమే చెల్లించాలని ఒత్తిడి చేస్తున్నాయి. దీంతో ఏం చేయాలో తెలియని టిడ్కో లబ్ధిదారులు లబోదిబోమంటున్నారు. టీడీపీ హయాంలో నూజివీడులో సుమారు రూ.250 కోట్లు వ్యయంతో పీఎంఏవై, ఎన్టీఆర్ కాలనీల పేరుతో 4,030 టిడ్కో జీ+3 ఇళ్లు మంజూరయ్యాయి. ఇందులో లబ్ధిదారుడి వాటా చెల్లించిన వారికి టీడీపీ ప్రభుత్వం దిగిపోయే సమయానికి 2,630 టిడ్కో జీ+3 గృహాలను దాదాపు 80 శాతం పూర్తి చేశారు. 2019 తొలి నాళ్లల్లో జీ+3 భవనాలను లబ్ధిదారుల కేటాయింపు కూడా జరిగింది. అయితే అనంతరం వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ టిడ్కో భవనాలను పూర్తిగా నిర్లక్ష్యం చేయడంతో భవనాల నిర్మాణం ఆగిపోయింది. విమర్శలు వెల్లువెత్తడంతో నెలరోజుల క్రితం ఈ భవనాల మిగిలిన పనులను పేరుకు ప్రారంభిం చగా, అవి నత్తనడకన నడుస్తున్నాయి. మరోవైపు లబ్ధిదారు లను వైసీపీ ప్రభుత్వం అప్పుల ఊబిలోకి దింపింది. నూజి వీడులోని జీ+3 భవన నిర్మాణాలను రెండో విడతలో పూర్తి చేస్తామని ఈ లోపు లబ్ధిదారులు బ్యాంక్ రుణాలను చెల్లించకుండా రాష్ట్రప్రభుత్వం రెండేళ్ల పాటు మారటోరియం విధించింది. ప్రస్తుతం ఇదే మారటోరియం లబ్ధిదారులకు గుది బండగా మారింది. ఒక్కో లబ్ధిదారుడి రుణానికి దాదాపు రూ.70 వేల నుంచి రూ.లక్ష వరకు అదనంగా చెల్లించాల్సిన పరిస్థితి. ఎన్ని కలు దగ్గరపడుతున్న సమయంలో ప్రతిపక్ష తెలుగుదేశం, జనసేన, వామపక్ష పార్టీలు జీ+3 భవన నిర్మాణాలపై ఆందో ళన బాట పట్టడంతో ఫిబ్రవరి మొదటి వారం కొంత పనులు ప్రారంభమయ్యాయి. అయితే గత టీడీపీ హయాంలోనే పూర్తయ్యి రంగులు వేసిన భవనానికి ప్రస్తుతం వైసీపీ రంగులు వేసి భవన నిర్మాణాలు వేగంగా, తమ హయాంలో జరుగుతున్నట్టుగా చూపే ప్రయత్నం చేస్తున్నారని లబ్ధిదారులు, ప్రతిపక్ష పార్టీలు ఆరోపిస్తున్నాయి. మరోవైపు టిడ్కో ఇళ్లను సకాలంలో అందివ్వకుండా రాష్ట్ర ప్రభుత్వం చేసిన కాలయాప నకు భవన నిర్మాణ లైఫ్‌స్పాన్ ఐదేళ్లు నిరుపయోగంగా మా రింది. ప్రభుత్వ అనాలోచిత నిర్ణయాలతో ఏర్పడిన పరిస్థితు లను సరిచేసేందు కు ప్రభుత్వమే చర్యలు చేపట్టాలని టిడ్కో రుణాలను రద్దుచేయాలని లబ్ధిదారులు కోరుతున్నారు.



నూజివీడులో టీడీపీ ప్రభుత్వ హయాంలోనే పూర్తయిన టిడ్కో భవనాలకు రంగులు మారుస్తున్న దృశ్యం



ఏలూరు టిడ్కో ఇళ్ల దుస్థితి

ఎక్కడి పనులు అక్కడే..

జంగారెడ్డిగూడెం టౌన్ : పేదల ఇంటి కలను నిజం చేసేలా తెలుగుదేశం ప్రభుత్వం మొదలుపెట్టిన టిడ్కో ఇళ్లకు పట్టిన గ్రహణం వీడలేదు. జంగారెడ్డిగూడెంలో 2016లో 864 టిడ్కో గృహసముదాయాల నిర్మాణం మొదలుపెట్టారు. 2019 ఎన్నికలు సమీపించే సమయానికి నిర్మాణాలు చివరిదశకు వచ్చాయి. అయితే వైసీపీ ప్రభు త్వం వచ్చాకా నేటి వరకు మిగిలిన నిర్మాణ పనులు అడుగు ముందుకు కదల్లేదు. అధి కారంలోకి వచ్చిన నాటి నుంచి తేదీలు మార్చుకుంటూ ప్రజల ను మభ్య పెడుతూ వస్తోంది. నాలుగు ఫేజ్‌లుగా టిడ్కో గృహ లను విభజించి నిర్మాణ పనులు చేపట్టారు. జంగారెడ్డిగూడెం 4వ ఫేజ్‌లో ఉండడంతో నేటికీ మిగిలిన పనులు మొదలు కాకపోవడం గమనార్హం. ఇప్పట్లో మొదలయ్యే అవకాశం లేదని ఒకవైపు అధికారులు చెబుతుండగా ప్రభుత్వం మాత్రం లబ్ధిదారులకు త్వరలోనే ఇస్తామంటూ ఊదరగొడుతోంది.



జంగారెడ్డిగూడెంలో ఇలా ..



కార్యక్రమంలో మాట్లాడుతున్న డీపీవో శ్రీనివాస విశ్వనాథ్

నిర్భయంగా ఓటు హక్కును వినియోగించుకోవాలి : డీపీవో

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17 : ఓటరుగా నమోదైన ప్రతిఒక్కరూ స్వేచ్ఛాయుత వాతావరణంలో నిర్భయంగా తమ ఓటుహక్కును వినియోగించుకోవాలని స్వీప్ జిల్లా నోడల్ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి తూతిక శ్రీనివాస విశ్వనాథ్ తెలిపారు. బుట్టాయగూడెం మహిళా సమాఖ్య సమావేశ మందిరంలో శనివారం స్వీప్ కార్యకలాపాలు, స్వీప్ 2024 జిల్లా కార్యాచరణ ప్రణాళిక అములులో భాగంగా డ్వాక్రా మహిళలతో జరిగిన మహిళా చైతన్య కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో జిల్లాలో అన్ని ప్రాంతాల్లో ఓటింగ్ శాతం పెంచేందుకు స్వేచ్ఛగా ఓటుహక్కును వినియోగించుకునేందుకు 45 రోజులుపాటు జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్వీప్ చైతన్య కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో మరింతగా ఓటింగ్ శాతం పెంచడానికి అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. డీఆర్‌డీఏ పీడీ డా.ఆర్.విజయరాజు, ఆర్డీవో కె.అద్దయ్య, ఎంపీడీవో ప్రవీణ్‌కుమార్ ఓటుహక్కు వినియోగం, ఈవీ ఎంల పనితీరు, అపోహలపై అవగాహన కల్పించారు. మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో మహిళలు మానవహారం నిర్వహించగా డీపీవో ఓటు హక్కు విని యోగంపై ప్రతిజ్ఞ చేయించారు. ఏసీ సుబ్బారావు, ఏపీ ఎం, కార్యదర్శి కిరణ్ కుమార్ మహిళలు పాల్గొన్నారు.

ఇంటర్ ప్రాక్టికల్స్‌కు 2,607 మంది హాజరు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్మీడియట్ ఒకేషనల్, జనరల్ విభాగాల ప్రాక్టికల్స్ పరీక్షలకు మొత్తం 2,667 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా 2,607 మంది హాజరయ్యారని డీవీఈవో ప్రభాకరరావు ఓ ప్రకటనలో తెలిపారు. పరీక్షలు ప్రశంతంగా ముగిశాయన్నారు.

ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా టీఈఎం రాజు

ఏలూరు సిటీ, ఫిబ్రవరి 17 : ఎన్నికల బదిలీల్లో భాగంగా తాజాగా ఏలూరు జిల్లా ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా టీఈఎం రాజును నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇప్పటివరకు ఇక్కడ ఈడీగా పనిచేసిన ఆర్.కుముదిని సింగ్‌ను బాపట్ల జిల్లా హౌసింగ్ పీడీగా నియమించారు. ఈ మేరకు ప్రభుత్వం నుంచి ఉత్తర్వులు జారీ అయ్యాయి.

పుస్తకాల గుట్టలు.. పాముల నివాసం!

- అధ్వానంగా సమగ్రశిక్ష భవనం
- ఏపీసీ సోమసుందర్ అసహనం



ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : ఐదేళ్లుగా కార్యాలయంలోని వివిధ విభాగాలు, గదుల నిర్వహణను అటకెక్కించిన వైనంపై సమగ్రశిక్ష జిల్లా ప్రాజెక్టు నూతన ఏపీసీగా కొద్దిరోజుల క్రితం బాధ్యతలు చేపట్టిన సోమశేఖర్ అసహనం వ్యక్తం చేశారు. కార్యాలయంలోని ఆయా విభాగాలను శనివారం సందర్శించిన ఆయన గదుల్లో చెత్తాచెదారం, విద్యార్థులకు పంపిణీ చేయకుండా ఉంచిన పుస్తకాల గుట్టలు, కుక్కలు, పాములు నివాసం ఏర్పరచుకున్న గదులను పరి శీలించారు. కార్యాలయ పక్కనేవున్న ఇంజనీరింగ్ విభాగంలో పుస్తకాల నిల్వలపై ప్రశ్నించారు. విద్యార్థులకు సకాలంలో పుస్తకాలను అందజేయకపోతే ఆశించిన ఫలితాలు ఎలావస్తాయన్నారు. చివరిసారిగా ఐదేళ్ల క్రితం ఇక్కడ పనిచేసిన ప్రా జెక్టు అధికారి బదిలీపై వెళ్లిపోవడంతో కార్యాలయ నిర్వహణను పట్టించుకున్న వారే కరవయ్యారని చెబుతున్నారు. అప్పటి నుంచి విధులు నిర్వర్తించిన అధికారు లంతా ఇన్‌చార్జి హోదాలో ఉండడం, తమకు పట్టనట్టు వ్యవహ రించడంవల్లే ఈ దుస్థితి నెలకొందని తెలుస్తోంది. ఏపీసీ వెంట సెక్టోరల్ ఆఫీసర్లు రామారావు, రమేష్, రాధాకృష్ణ తదితరులున్నారు.

పాఠశాలల్లో సమగ్రశిక్ష ఏపీసీ తనిఖీలు



సమగ్రశిక్ష జిల్లా ఏపీసీ బి.సోమశేఖర్ శనివారం శనివారపుపేట ఎంపీపీ స్కూలు, జడ్పీ హైస్కూళ్లలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక అవసరాలుగల పిల్లల (సీడబ్ల్యూఎస్ఎన్) కోసం నిర్వహిస్తున్న భవిత కేంద్రాలు, హోంబేస్డ్ టీచింగ్ స్కూళ్లలో బోధనావిధానాన్ని పరిశీలించి పలు సూచనలు చేశారు. నగరంలో వివిధచోట్ల సీడబ్ల్యూఎస్ఎన్ పిల్లలకు ఇంటివద్ద ఐఈఆర్టీలు బోధిస్తున్న విధానాన్ని పరిశీలించారు. ఆయన వెంట ఎస్ఎస్ఏ సెక్టోరల్ అధికారులు రాధాకృష్ణ, రామారావు తదితరులున్నారు.



సత్రంపాడు జడ్పీ హైస్కూలులో పదో తరగతి విద్యార్థినుల నోట్ పుస్తకాలను పరిశీలిస్తున్న డీఈవో

ఇంగ్లీషు టీచర్‌కు షోకాజ్ నోటీసు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : ఏలూరు రూరల్ మండలంలోని సత్రంపాడు, శ్రీపర్రు జడ్పీ హైస్కూళ్లలో డీఈవో ఎస్.అబ్రహం శనివారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. ఏడో తరగతి విద్యార్థుల నోట్ పుస్తకాలను దిద్దనికారణంగా శ్రీపర్రు జడ్పీ హైస్కూలు ఇంగ్లీషు టీచర్‌కు షోకాజ్ నోటీసులు జారీ చేసినట్టు డీఈవో తెలిపారు. సత్రంపాడు జడ్పీ హైస్కూలు తరగతి గదుల్లో అమర్చిన ఇంట్రాక్టివ్ ఫ్లాట్ ప్యానెల్ (ఐఎఫ్‌పీ)ల వినియోగం సరిగాలేకపోవడాన్ని గమనించిన ఆయన స్కూలు టీచర్లందర్నీ సమావేశ పరిచి సాయంత్రంలోగా లోటుపాట్లను సరిదిద్దుకోకపోతే చర్యలు తప్పవని హెచ్చరించారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడారు. జిల్లాలోని పాఠశాలలను సందర్శించిన సమయంలో ఎక్కడైనా ఐఎఫ్‌పీల వినియోగంలేకపోయినా, ట్యాబ్‌ల వినియోగం తక్కువగావున్నా, విద్యార్థుల నోట్‌బుక్స్ దిద్దకపోయినా తదితర వెనుకబాట్లు గుర్తిస్తే సంబంధిత బాధ్యులపై అక్కడికక్కడే శాఖాపరమైన చర్యలు తీసుకుంటానని హెచ్చరించారు.



కాంగ్రెస్ అస్త్రం.. పోలవరం డిక్లరేషన్

- జగన్ ప్రభుత్వ వైఫల్యాలపై సమరశంఖారావం
- గిరిజన, గిరిజనేతర రైతుల మద్దతు దిశగా వ్యూహం
- ఎన్నికల నోటిఫికేషన్ ముందే భారీ బహిరంగ సభకు ప్లాన్
- రాహుల్‌తో పాటు ఖర్గే, ప్రియాంక హాజరయ్యేలా యత్నాలు

(ఏలూరు, ఆంధ్రజ్యోతి ప్రతినిధి)

ఆంధ్రుల జీవనాడి పోలవరం. ఈ ప్రాజెక్ట్ కోసమే రైతులు వేయి కళ్లతో ఎదురు చూశారు. గిరిజన, గిరిజనేతర కుటుంబాలు ప్రాజెక్ట్ నిర్మాణానికి అనువుగా ఉన్న ఊరు, సొంత భూమి త్యాగం చేశారు. లక్షలాది మంది రైతు కుటుంబాలకు బాసటగా నిలిచారు. ఇన్ని త్యాగాలు చేసినా కుటుంబాలకు జగన్ అధికారంలోకి రాకమునుపు, వచ్చిన తర్వాత నోటికొచ్చినన్ని హామీలు ఇచ్చారు. నిర్మాణ పనులను గాలికి వదిలేశారు. తమ తప్పును కవర్ చేసుకుంటూ తెలుగుదేశం ప్రభుత్వంపై నిందలు మోపారు. గడిచిన ఐదేళ్లుగా ప్రాజక్టు పనులు ఎక్కడికక్కడే. ప్రారంభోత్సవ ముహూర్తాలు కేలండర్లు మారినా ఇప్పటికీ ఖరారు కాలేదు. ఈ అంశాలన్నిటినీ కాంగ్రెస్ ఎన్నికల అస్త్రాలుగా వినియోగించుకోబోతోంది. పోలవరం ప్రాజెక్టుకు పూర్తి మద్దతు ప్రకటిస్తూ ఇక్కడి జగన్ ప్రభుత్వం, పైనున్న కేంద్రం తప్పులను ఎండగడుతూ.. నోటిఫి కేషన్‌కు ముందే పోలవరం డిక్లరేషన్‌ను ఏలూరు జిల్లా నుంచే ప్రకటించాలని భావిస్తోంది.

ఎండగడదాం.. ముందు నిలుద్దాం..

ఎన్నికలు మరికొద్ది రోజుల్లో జరగనుండగా కాంగ్రెస్ కాస్త వేగం పెంచింది. వ్యూహం మార్చి జనాలకు దగ్గరయ్యేందుకు అస్త్ర, శస్త్రాలను సంధించాలని భావిస్తోంది. దీనికి అనుగుణంగానే పోలవరం ప్రాజెక్టును గడచిన ఐదేళ్లలో జగన్ సర్కార్ ఎలా గాలికివదిలేసిందో, కేంద్రం చూసీ చూడనట్లుగా ఎలా ప్రేక్షక పాత్ర వహించిందో జనం ముందుకు తేవాలని భావిస్తోంది. దీనిలో భాగంగానే గిరిజనులు, గిరిజనేతరులు, రైతులతో జిల్లాలో భారీ బహిరంగ సభ నిర్వహించాలని యోచిస్తోంది. ఈ సభలోనే పోలవరం డిక్లరేషన్ ప్రకటించాలని ఆ పార్టీ వ్యూహంగా కనిపిస్తోంది. ఉమ్మడి గోదావరి జిల్లాల్లో పెద్ద ఎత్తున ఉన్న గిరిజన కుటుంబాలకు దగ్గరవడం, జగన్ ప్రభుత్వం వీరందరినీ ఎలా మభ్యపెట్టిందో, ఇచ్చిన హామీలు ఇంకా చేతి కందని పరిహారం గురించి గళమెత్తడం కారణంగా కాంగ్రెస్ మద్దతు పెరిగేలా చూడాలని భావిస్తున్నారు. వీలైతే పోలవరం డిక్లరేషన్ సభకు యువనేత రాహుల్‌గాంధీ, కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లిఖార్జున్ ఖర్గే , ప్రియాంక గాంధీ హాజరయ్యేలా చూడాలని పార్టీ అగ్రనేతలు భావిస్తున్నట్టు సమాచారం. ప్రత్యేకించి పోలవరాన్ని అందుకోగలిగితే అలవోకగా వివిధ వర్గాల సంఘీభావం పొందగలుగుతామని పార్టీ సీనియర్లు ఈ దిశగానే అడుగులు వేస్తున్నారు. ఎన్నికల నోటిఫికేషన్ మార్చి రెండో వారంలో వెలువడే అవకాశాలున్నందున ఆలోపే డిక్లరేషన్ సభ పెట్టాలని భావిస్తున్నారు. అనంతపురంలో ఈనెల 26న ఎన్నికల శంఖారావం పూరిస్తుండడంతో వచ్చే నెలలోనే మరో భారీ బహిరంగ సభకు ప్రణాళిక రూపొందిస్తున్నారు. పీసీసీ అధ్యక్షురాలు షర్మిలతో పూర్తిగా చర్చించిన తర్వాత తేదీ ఖరారు కావచ్చని భావిస్తున్నారు. ఆలోపే వివిధ నియోజకవర్గాల నుంచి పోటీ చేయదలచిన అభ్యర్థుల ఖరారు ఒక కొలిక్కి వస్తుందని, ఇది కూడా వారందరికీ ఒక టానిక్‌లా పని చేసేలా ఉండాలని కాంగ్రెస్ భావిస్తోంది.

పోలవరం ప్రధానాస్త్రం

సార్వత్రిక ఎన్నికలకు వచ్చే నెల రెండో వారంలోనే నగారా మోగబోతోంది. ప్రధాన పక్షాలన్నీ తమ ప్రచారాన్ని మరింత ఉధృతం చేయబోతున్నాయి. సాధ్యమైనంత మేర జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన తప్పొప్పులను, ప్రజా మోసాలతో పాటు పోలవరం ప్రాజక్టు నిర్మాణం నిలిచిపోవడాన్ని ప్రధాన ఎన్నికల అస్త్రంగా ప్రతిపక్షాలన్నీ సంధించబోతున్నాయి. పోలవరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ ఓ డిక్లరేషన్ ఇవ్వాలని భావిస్తోంది. నిర్మాణ పనులు నిలిచిపోవడం, నిర్వాసిత కుటుంబాలు ఆగమాగమం కావడం, నష్టపరిహారం పెండింగ్‌లోనే ఉంచడం వంటి అంశాలన్నిటినీ ఏకరవు పెట్టాలని భావిస్తోంది. వాస్తవానికి గత ఐదేళ్లుగా కేంద్రంలోని బీజేపీ, రాష్ట్రంలో వైసీపీలు పోలవరం నిర్లక్ష్యానికి ప్రధాన నిందితులుగా చూపేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తోంది. దీనిలో భాగంగానే వీలైతే, ప్రత్యేకించి పోలవరంపై ఒక సమగ్ర డిక్లరేషన్ ప్రకటించాలని ఇప్పటికే ఆ పార్టీ అగ్రనేతలు ఒక నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. దాదాపు ఏడు లక్షల ఎకరాలకు సాగునీరందించడం, 340 గ్రామాలకు తాగునీరు అందించడం, విద్యుత్ ఉత్పత్తి సాధించడం ఇదే తరుణంలో రాష్ట్ర ముఖచిత్రం మారేలా మరిన్ని ప్రాంతాలకు సాగు, తాగునీటి సరఫరాకు అనువుగా ప్రాజెక్టు నిర్మాణం పూర్తి కావాలని అందరూ ఆకాంక్షించారు. ప్రత్యేకించి పోలవరం నిర్మాణం రాష్ట్ర విభజనానంతరం అప్పటి తెలుగుదేశం ప్రభుత్వం హయాంలో ప్రాజెక్టు నిర్మాణ పనులు శరవేగంగా సాగాయి. 2019 నుంచి ఇప్పటివరకు పనుల పురోగతి మూలనబడింది. నిధుల కేటాయింపులు అంతంతగానే మిగిలాయి. గిరిజన, గిరిజనేతర కుటుంబాలకు ఎన్నికల ముందు, ఆ తర్వాత కూడా వైసీపీ అధ్యక్ష, సీఎం హోదాలోనూ జగన్మోహన్ రెడ్డి అనేక హామీలు గుప్పించారు. ఈ మాటలతోనే పోలవరం వంటి నియోజక వర్గాల్లో వైసీపీ గెలిచేలా చూశారు. అయితే పోలవరానికి అన్నీ త్యాగం చేసిన కుటుంబాలు ఎక్కడికక్కడే మిగిలాయి. సహాయ పునరావాస ప్యాకేజీ (ఆర్ అండ్ ఆర్ ప్యాకేజి) కింద చెల్లించాల్సిన లక్షలాది రూపాయలను ఇప్పటికీ చెల్లించలేదు. ప్రాజెక్టులో 2014-19 మధ్య రోజుకు మూడు వేల మందికి పైగా కార్మికులు, 500 పైగా వాహనాలు నిత్యం పని చేశాయి. కరోనా దగ్గర నుంచి ప్రాజెక్టు నిర్మాణ ప్రాంతం చడీ చప్పుడు లేకుండా నిశ్శబ్దమైంది. కేంద్ర నిపుణుల కమిటీలు డజన్ల సంఖ్యలో ప్రాజెక్ట్ స్థలిని సందర్శించినా పురోగతి లేదు. పోలవరం ప్రాజెక్టుకు ఎందుకిలా జరిగిందో సామాన్యుడికి కూడా ఇప్పటికే అర్థమైంది. రైతువారీ కుటుంబాలు ఎన్నో కలలు కన్నా, జగన్ సర్కార్ వీరి ఆశలను గోదారి పాలు చేసింది.

టిక్కెట్ల కోలాహలం

కాంగ్రెస్ అంటేనే స్వేచ్ఛ ఉన్న పార్టీ. దీనికితోడు ఎన్నికలొచ్చాయంటే చాలు ఇంతకుముందు వివిధ వర్గాలు, ముఠాలూ రంగంలోకి దిగేవి. ఢిల్లీకి వెళ్లి లాబీయింగ్ చేసేవారు. కాని రాష్ట్ర విభజనానంతరం కాంగ్రెస్ రాష్ట్రంలో అడ్రస్ లేకుండా పోయింది. పీసీసీ అధ్యక్షురాలిగా షర్మిల నియామకం తర్వాత ఆ పార్టీ కేడర్‌లో కదలిక వచ్చింది. ఎన్నికల సంవత్సరం కావడంతో పాత, కొత్త తరాలు ఏకమై మరీ టిక్కెట్ల కోసం దరఖాస్తులు చేశాయి. ఎమ్మెల్యే, ఎంపీ స్థానాలకు గత నెలలోనే కాంగ్రెస్ దరఖాస్తులను ఆహ్వానించింది. దరఖాస్తు గడువు ఈనెల తొమ్మిది కాగా, ఇప్పుడు ఈ నెల 29 వరకు పొడిగించారు. కొన్ని అసెంబ్లీ నియోజక వర్గాల్లో కుర్రకారు దరఖాస్తులకు ముందుకు వచ్చారు. ఇప్పటికే జిల్లా కాంగ్రెస్ కమిటీలో పనిచేస్తున్న వారు మేమూ సిద్ధమంటూ పీసీసీ కార్యాలయానికి వెళ్లి వచ్చారు. లోక్‌సభ నియోజకవర్గ కన్వీనర్లుగా కనుమూరి బాపిరాజు, జెట్టి గుర్నాథరావును కాంగ్రెస్ అధిష్ఠానం నియమించింది. నరసాపురం, ఏలూరు పార్లమెంటరీ నియోజక వర్గాల పరిధిలో పార్టీ కేడర్‌ను సమన్వయపరిచే బాధ్యతను వీరికప్పగించారు. ఈలోపు ఈ రెండు లోక్‌సభ నియోజకవర్గాల పరిధిలోని అసెంబ్లీ స్థానాలకు వచ్చిన దరఖాస్తులలో అత్యధికంగా ఎనిమిది, అత్యల్పంగా రెండుగా తెలుస్తోంది. కైకలూరు నుంచి గాంధీ, నాగరాజు, నిరీక్షణ, ఏలూరు నుంచి రాజనాల రామ్మోహనరావు మరికొందరు, దెందులూరు నుంచి డీవీఆర్ చౌదరి, ఆలపాటి నరసింహమూర్తి, ఉంగుటూరు నుంచి హరి కుమార్ రాజుతో పాటు కాంగ్రెస్‌వాది దివంగత నేత చింతలపాటి మూర్తిరాజు మనవడు, ఇంకొంతమంది దరఖాస్తు చేసుకున్నారు. లోక్‌సభ స్థానాలకు ప్రత్యేకించి పోటీ అంటూ లేదు. సీనియర్లు రంగంలోకి దిగే అవకాశం ఉంది.



కలెక్టరేట్ వద్ద ఏపీ జేఏసీ నిరసన ర్యాలీ

మేమూ సిద్ధమే..

- సమస్యలు పరిష్కరించకపోతే... తడాఖా చూపిస్తాం..
- నాల్గవ రోజు కలెక్టరేట్ వద్ద ఉద్యోగుల ఆందోళన

ఏలూరు కలెక్టరేట్, ఫిబ్రవరి 17: మీరు సిద్ధమైతే మేము సిద్ధమేనంటూ ప్రభుత్వ తీరుపై ఉద్యోగులు గర్జించారు. ఎన్నికల ముందు ఉద్యోగులు ప్రభుత్వానికి హెచ్చరికలు పంపారు. హామీలు వాయిదాలతో ఐదేళ్లపాటు ఉద్యోగులను ఆవేదనకు గురిచేశారని ఇప్పుడు మాకు సమయం వచ్చిందని తడాఖా చూపిస్తామంటూ గర్జించారు. ఏపీజేఏసీ ఇచ్చిన పిలుపు మేరకు ఉద్యోగులు ఉద్యమ శంఖారావంలో భాగంగా నాల్గవ రోజు ఏపీ ఎన్జీవోలు, పంచాయతీరాజ్, ఏపీ జీఎల్ఐ, వ్యవసాయ, ట్రెజరీ, ఆర్‌అండ్‌బీ, ఉపాధ్యాయులకు తోడు పెన్షనర్లు కలెక్టరేట్ వద్ద శనివారం పెద్దఎత్తున ఆందోళన నిర్వహించారు. తొలుత జడ్పీ నుంచి ర్యాలీగా కలెక్టరేట్ చేరుకున్నారు. ఏపీ జేఏసీ చైర్మన్ కోటగిరి శ్రీనివాస్ మాట్లాడుతూ ప్రతి ఉద్యోగి రోడ్డున పడే పరిస్థితి ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేలోగా సమస్యలను పరిష్కరించాలని, చర్చలకు పిలవకుంటే మెరుపు సమ్మెకైనా సిద్ధమని హెచ్చరించారు. కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులను సర్వీసు క్రమబద్ధీకరించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులు దాచుకున్న డబ్బును కూడా సమయానికి ఇవ్వలేని ప్రభుత్వం అని మండిపడ్డారు. ఈనెల 27న జరిగే చలో విజయవాడకు సమాయత్తం కావాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వం దిగివచ్చే వరకు ఉద్యమం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. కన్వీనర్ నెరుసు రామారావు, సీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు పువ్వుల ఆంజనేయులు, యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి ఆర్.రవికుమార్, శ్రీధర్‌రాజు, కె.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడకు అనుమతుల్లేవ్ : ఎస్పీ

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17 : ఏపీసీపీఎస్ఈఏ ఉద్యోగులు ఈనెల 27న తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి ఎలాంటి అనుమతులు లేవని ఆ కార్యక్రమంలో పాల్గొనడం చట్ట విరుద్ధమని జిల్లా ఎస్పీ మేరీ ప్రశాంతి హెచ్చరించారు. జిల్లాలో సెక్షన్ 30 అమలులో ఉందని ర్యాలీలు, సమావేశాలు, సభలు నిర్వహించకూడదని, అనుమతిలేని కార్యక్రమానికి వెళ్లడం చట్టాన్ని ఉల్లంఘించడమేనని వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. ఇలాంటి అనుమతి కార్యక్రమాలకు వెళ్లవద్దని సీపీఎస్ ఉద్యోగులకు ఎస్పీ మేరీ ప్రశాంతి సూచించారు.

ఉద్యోగులకు ముందస్తు నోటీసులు



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17 : సీపీఎస్ ఉద్యోగులు తలపెట్టిన చలో విజయవాడ కార్యక్రమానికి వెళ్లకుండా ముందస్తు నోటీసులను శనివారం రాత్రి 11 గంటల సమయంలో ఆగిరిపల్లి పోలీసులు, ఎస్టీయూ నాయకుడు అంకం వెంకటేశ్వర రావుకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారంలోకి వచ్చిన వారంలోగా సీపీఎస్‌ను రద్దుచేసి పాత పెన్షన్లు పునరుద్ధరిస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాలుగేళ్లకు జీపీఎస్ అనే ఒక మోసపూరిత పెన్షన్ విధానాన్ని తీసుకొచ్చి ఐదు లక్షల సీపీఎస్ ఉద్యోగులు, వారి కుటుంబాలకు కన్నీరు మిగిల్చారన్నారు. ఇలాంటి ఉద్యోగ, ఉపాధ్యాయ కార్మికులకు నష్టం కలిగించే సీపీ ఎస్, జీపీఎస్ విధానాలను రద్దు చేయాలని ప్రజాస్వామ్యంగా న్యాయ బద్ధంగా చేసే నిరసన కార్యక్రమాలకు వెళ్లకుండా ముందస్తు నోటీసులు ఇచ్చి అడ్డుకోవడం ప్రజాస్వామ్యహితం కాదన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఏడీఆర్ వరలక్ష్మి

సార్వాకు నూతన వరి వంగడం

మార్టేరు వరి పరిశోధనాస్థానం ఏడీఆర్ డాక్టర్ వరలక్ష్మి

పెనుమంట్ర, ఫిబ్రవరి 17 : బొండాలు రకానికి ప్రత్యమ్నాయంగా సార్వాలో నూతన రకాన్ని రూపొందించామని ఈ రకం 1000 గింజలు కలిగి బరువు సుమారుగా 24 గ్రాములు ఉన్నదని చివరి దశ పరిశోధనలో ఉన్నదని మార్టేరు వరి పరిశోధనా స్థానం ప్రధాన సంచాలకురాలు డాక్టర్ ఎం.భరతలక్ష్మి తెలిపారు. శనివారం ఉదయం పెనుమంట్ర మండలం మార్టేరు వరి పరిశోధన స్థానంలో శిక్షణ, సందర్శన కార్యక్రమం తణుకు ఏడీఏ ఎంవీ రమేష్ అధ్యక్షతన జరిగింది. ప్రస్తుతం చాలా ప్రాంతాలలో జింక్ లోపం కనిపిస్తున్నదని, వ్యవసాయ అధికారులు రైతులకు ఎప్పటికప్పుడు అవగాహన కల్పించాలని కోరారు. యంత్రాలతో కోతలు కోస్తూ ఉండటం వల్ల దాళ్వాలో కాండం తొలిచే పురుగు ఎక్కువవుతోందని తెలిపారు. ఈ దాళ్వాలో కొన్ని ప్రాంతాలలో సాగుచేస్తున్న ఆర్ఎన్ఆర్ 15048 రకం పనితీరు గురించి వ్యవసాయ అధికారులను అడిగి తెలుసుకున్నారు. నానో యూరియా, నానో డీఏపీ వంటి వాటిలో ఇతర పురుగు మందులు కలిపి పిచికారీ చేయవచ్చో లేదో తెలియజేయాలని శాస్త్రవేత్తలను ఆదేశించారు. తణుకు ఏడీఏ .రమేష్ మాట్లాడుతూ జిల్లాలో సుమారు 77,300 హెక్టార్లలో ఎంటీయూ 1121 రకాన్ని సాగు చేశారని, తర్వాత స్థానాలలో పీఆర్ 126, ఎస్ఎల్ 10 రకాలు ఉన్నాయని తెలిపారు. శాస్త్రవేత్తలు శ్రీనివాస్, కృష్ణాజీ పాల్గొన్నారు.



ద్వారకాతిరుమలలో దుకాణాలు తనిఖీలు చేస్తున్న అధికారులు

బాలలను పనుల్లో పెట్టుకుంటే చర్యలు

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 17: బాలలను కిరాణా షాపులు, హోటళ్లు, మెకానిక్ తదితర పనుల్లో పెట్టుకుంటే సంబంధిత యజమానులపై బాలకార్మిక (నిషేద, నియంత్రణ) చట్టం-1986 ప్రకారం కేసులు నమోదు చేసి చర్యలు తీసు కుంటామని కార్మికశాఖ సహాయ అధికారి గోపాలకృష్ణ హెచ్చ రించారు. ద్వారకా తిరుమల కొండపైన, దిగువనున్న దుకాణాలను శనివారం పరిశీలించారు. బాలలను పనుల్లో పెట్టుకుంటే యజమానులకు 6 నెలల నుంచి రెండేళ్లవరకూ జైలుశిక్ష, రూ.20 నుంచి 50వేల వరకూ జరిమానా విధిస్తామన్నారు. అధికారులు వెంకట రమణన్, మోహన్, మహిళా పోలీస్ లక్ష్మీసుజన తదితరులు పాల్గొన్నారు.

పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17 : పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నట్లు నెహ్రూ కేంద్ర జిల్లా అధికారి దూలం కిషోర్ ఒక ప్రకటనలో తెలిపారు. పార్లమెంటు భవనంలో జరిగే జాతీయ యూత్ పార్లమెంటు ఫెస్టివల్-2024 లో భాగంగా పార్లమెంటులో ప్రసంగించే అవకాశం కోసం ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో 18 నుంచి 25 ఏళ్ల వయసు వారికి ఉపన్యాస పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ పోటీలు Young Voices: Engage and Empower for Nation's Transformation అనే అంశంపై ఉపన్యాస పోటీలు ఉంటాయని తెలిపారు. జిల్లా స్థాయి పోటీలు ఈనెల 20వ తేదీ మంగళవారం ఆన్‌లైన్ వర్చువల్ మోడ్‌లో జరుగుతుందన్నారు. పేరు నమోదు కోసం మొబైల్ నంబర్ 8884763735లో సంప్రదించాలని తెలిపారు.

వైద్య ఉద్యోగాల భర్తీ నోటిఫికేషన్ రద్దు

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 : ఉమ్మడి జిల్లా వైద్య ఆరోగ్యశాఖ ఐడీఎస్పీ విభాగంలో ఖాళీగా వున్న ఎపిడిమియాలజిస్టు పోస్టులను కాంట్రాక్టు ప్రాతిపదికన భర్తీచేసేందుకు ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌ను నిలిపివేసినట్టు డీఎంహెచ్‌వో డాక్టర్ శర్మిష్ట ఓ ప్రకటనలో తెలిపారు. ఎన్‌హెచ్‌ఎంకు సంబంధించిన ఉద్యోగ నియామకాల ప్రక్రియను కొత్తగా ఏర్పాటుచేసిన ఏపీ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ద్వారా మాత్రమే చేపట్టాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందున ఈ నిర్ణయం తీసుకున్నట్టు వివరించారు. ఈ నేపథ్యంలో ఉమ్మడి జిల్లాలో ఎపిడిమియాలజిస్టు ఉద్యోగ నియామకాలకు ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న అభ్యర్థులందరూ సంబంధిత నోటిఫికేషన్‌ను రద్దు చేసినట్టుగా గమనించాలని సూచించారు. వివరాలకు జిల్లా అధికారిక వెబ్‌సైట్‌ను సందర్శించాలని కోరారు.

బీఈడీ ప్రత్యేక విద్య కోర్సుకు అడ్మిషన్లు

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17: రీహాబిలిటేషన్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా న్యూఢిల్లీ రెండేళ్ల బీఈడీ స్పెషల్ ఎడ్యుకేషన్ ప్రత్యేక విద్యాకోర్సులు 2023-25 విద్యా సంవత్సరానికి అడ్మిషన్‌ల కోసం నోటిఫికేషన్ జారీ చేసిందని దొండపాటు పరివర్తన్ బధిరుల పాఠశాల ప్రిన్సిపల్ డి.శ్రీనివాస్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీలో ఓసీలకు 50 శాతం, బీసీ, ఎస్సీ, ఎస్టీ, పీహెచ్ వారికి 45 శాతం మార్కులు ఉత్తీర్ణత పొందిన యువతీ యువకులు అర్హులు అన్నారు. ఈ కోర్సు పూర్తి అయిన వారికి ప్రభుత్వం నిర్వహించే డీఎస్సీ, సర్వశిక్ష అభయాన్ (రాజీవ్ విద్యామిషన్)లో ఐఈఆర్టీ రీసోర్స్ ఉపాధ్యాయులుగా, స్వచ్ఛంద సంస్థల్లో ఉపాధి పొందవచ్చన్నారు. ఆసక్తిగల అభ్యర్థులు ఈనెల 28వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. వివరాలకు 99486 00642 నంబర్‌లో సంప్రదించవలసిందిగా కోరారు.

ఆగి ఉన్న లారీని ఢీకొట్టిన కారు..ముగ్గురికి గాయాలు



దెందులూరు, ఫిబ్రవరి 17 : జాతీయ రహదారి సత్యనారాయణపురం సమీపంలో ఆగి ఉన్న లారీని కారు ఢీకొన్న ప్రమాదంలో ముగ్గురికి గాయాలయ్యాయి. బంధువుల ఇంటికి సామర్లకోట నుంచి కే.సురేంద్ర అతని భార్య, కుమార్తె ముగ్గురూ కారులో వరంగల్ బయలుదేరారు. సత్య నారాయణపురం సమీపంలో పక్కన ఆగి ఉన్న లారీని కారు బలంగా ఢీకొట్టడంతో కారు నడుపుతున్న సురేంద్రతో పాటు అతని భార్య కుమార్తెలకు గాయాలయ్యాయి, స్థానికులు దగ్గరలోని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేశారు.

30 లీటర్ల సారా స్వాధీనం..

చింతలపూడి, ఫిబ్రవరి 17 :చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెం గ్రామంలో చింతలపూడి పోలీసులు దాడి జరిపి 200 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. 30 లీటర్ల సారా స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో సీఐ సుధాకర్, ఎస్ఐలు కుటుంబరావు, చెన్నారావులు పాల్గొన్నారు.



తెలవారింది స్వామీ..మేలుకో

శ్రీవారి క్షేత్రంపై హిమసోయగం

ద్వారకాతిరుమల, ఫిబ్రవరి 17: మంచు కురిసే వేళ.. ద్వారకాతిరుమల శ్రీవారి క్షేత్రం ప్రకృతి రమణీయ దృశ్యాలతో శోభిల్లింది. తెలవారింది.. ఇక మేలుకో శ్రీనివాసా.. అంటూ ఆలయ అర్చకులు స్వామివారిని తెల్లవారుజామున మేల్కొలిపి విశేష పూజాదికాలు జరిపారు. శేషాచలంపై లేలేత రవి కిరణాలను మంచు పొరలు కమ్ముకున్నాయి. శ్రీవారి ఆలయపరిసరాలు, ఘాట్‌రోడ్డు ప్రాంతం, క్షేత్రపాలకుని ఆలయానికి వెళ్లే దారి.. ఇలా పలు ప్రదేశాల్లో దట్టమైన పొగమంచు అలుముకుంది. వేకువజామునే ఘాట్‌రోడ్డులో వాకింగ్‌కు వెళ్లిన గజలక్ష్మి మంచుతెరల నడుమ విహరించింది. ఉదయం 8-30 గంటలు దాటినా భానుడి దర్శనం కలుగలేదు. శనివారం చిన వెంకన్న సన్నిధి భక్తుల రాకతో కళకళలాడింది.శుక్రవారం సాయంత్రానికే పలువురు భక్తులు కాలినడకన క్షేత్రానికి విచ్చేసారు. దీంతో ఆలయంలోని అన్ని విభాగాలు యాత్రికులతో నిండిపోయాయి.దాదాపు 15 వేలమంది పైబడి భక్తులు దర్శించినట్లు ఆలయవర్గాలు భావిస్తున్నాయి. భక్తుల వాహనాలతో పార్కింగ్ ప్రదేశం కిటకిటలాడింది. దర్శనానంతరం వారంతా స్వామివారి ఉచిత అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీవారి సాధారణ దర్శనానికి 2 గంటల పైబడి సమయం పట్టింది.





చిన వెంకన్న క్షేత్రంలో దట్టంగా కమ్ముకున్న మంచు





రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిందే

రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం అధ్యక్షుడు సాయి శ్రీనివాస్

పాలకోడేరు, ఫిబ్రవరి 17 : రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు బకాయిలను చెల్లించడంలో సత్వరం నిర్ణయం తీసుకోకపోతే ప్రభుత్వం తగు మూల్యం చెల్లించక తప్పదని రాష్ట్ర ఉపాధ్యాయ సంఘం హెచ్చరించింది. భీమవరం శివారు గొల్లలకోడేరులో ఉన్న ఢిల్లీ పబ్లిక్ స్కూల్ ఆడిటోరియంలో శనివారం 77వ రాష్ట్ర కౌన్సిల్ సమావేశం జరిగింది. రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు సాయి శ్రీనివాస్, హెచ్.తిమ్మన్నలు మాట్లాడుతూ నాడు నేడు పనులు, మిడ్‌డే మిల్స్ పర్యవేక్షణ వంటి పనులకు ఉపాధ్యాయులను బాధ్యులు చేయడం, 117 జీవో ద్వారా విద్యారంగాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేయడం ఆందోళన కలిగిస్తోందన్నారు. పాఠశాలల విలీనం ద్వారా పల్లె బడులకు మనుగడకు ముప్పు వాటిల్లిందన్నారు. ఉపాధ్యాయులపై పని భారాన్ని 40 శాతం పెంచడం, విద్యార్థుల సంఖ్య తరగతి గదిలో 60కి పెంచడం, పర్యవేక్షణల పేరుతో ప్రిన్సిపల్ సెక్రటరీ దాడులు, వేధింపులు మధ్య ఉపాధ్యాయులు తీవ్రమైన మానసిక ఒత్తిడికి గురవుతున్నారన్నారు. 202 ఉన్నత పాఠశాలలను ప్లస్-2గా ఉన్నతీకరించి పదోన్నతుల ద్వారా పీజీ టీచర్లను నియమించకుండా రీ డిప్లాయిమెంట్ పేరుతో ఒక ఇంక్రిమెంట్ ఇచ్చి నియమించడం, ఇంతవరకు పెరిగిన ఇంక్రిమెంటు చెల్లించకపోవడం దారుణమన్నారు. లాంగ్వేజ్ స్కూల్ అసిస్టెంట్స్ విషయంలో చొరవ చూపక పోవడం వలన ఉన్న ఉపాధ్యాయులపై తీవ్రమైన పనిభారం పడుతుందన్నారు. పరీక్ష విధానం అయితే మరీ ఘోరంగా మారిందన్నారు. ఏ పరీక్ష ఎప్పుడు నిర్వహిస్తారో తెలియని పరిస్థితి. ఒక క్యాలెండర్ విధాన రూపకల్పన లేక పరీక్షలు ఎప్పుడు నిర్వహిస్తారో విద్యార్థులకు తెలియని పరిస్థితి నెలకొందన్నారు. యాప్‌ల పేరుతో ఉపాధ్యాయులు వేధించినట్లే విద్యార్థులు కూడా బైజూస్, టోఫెల్ సిలబస్ ప్రవేశపెట్టి గందరగోళానికి గురి చేస్తున్నారన్నారు. ఉపాధ్యాయులపై పెరిగిన పనిభారాన్ని, ఒత్తిడిలను తగ్గించుకోవడానికి ప్రభుత్వాలపై ఒత్తిడి తీసుకురావాలన్నారు. ఒకటిన్నర దశాబ్దం పోరాటం చేసి రద్దు చేసుకున్న అప్రెంటిస్ విధానాన్ని మళ్లీ ప్రవేశపెట్టాలనే దుర్మార్గపు ఆలోచనతో ఉన్న ఈ ప్రభుత్వానికి బుద్ధి చెప్పాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సమావేశంలో ఎస్టీయూ రాష్ట్ర నాయకులు గాజుల నాగేశ్వరరావు, ప్రసాద్, సుబ్రహ్మణ్యంరాజు, గంటా మోహన్, రామచంద్రరావు, చంద్రశేఖర్, ఎర్రయ్య, వివిధ జిల్లాల నుంచి ఎస్టీయూ నాయకులు పాల్గొన్నారు.

ఒకప్పటి పుణ్యక్షేత్రం.. నేడు మురికి కూపం..

ఇబ్బందులు పడుతున్న భక్తులు



పాలకోడేరు, ఫిబ్రవరి 17 : పాలకోడేరు శివారు మోగల్లు గ్రామం వద్ద ఉత్తర దిశగా ప్రయాణం చేస్తున్న గోస్తని నది ఒకప్పుడు భక్తులతో కిటకిట లాడుతూ పుణ్యక్షేత్రంగా ఉండేది. అటువంటి నది నేడు మురికి కూపంగా తయారై ముక్కు మూసుకుని వెళ్లాల్సిన పరిస్థితి వచ్చింది. కాశీకి వెళ్లలేని భక్తులంతా దక్షిణ దిశ నుంచి ఉత్తరానికి ప్రవహించే ఈ నదినే మరో కాశీగా భావించి ఆ పుణ్యనదిలో స్నానాలు ఆచరించి మొక్కులు తీర్చుకునే వారు. అటువంటి పుణ్యక్షేత్రం నేడు అధ్వానంగా తయా రైంది. అటువంటి పుణ్యక్షేత్ర నది వద్ద పవిత్ర గోస్తని నదీ ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధపడు తున్నారు. ఒకప్పుడు ఈ గోస్తని నది తీర్థోత్సవాలలో పాల్గొనేందుకు పాల కోడేరు మండల వాసులే కాకుండా సుదూర ప్రాంతాల నుంచి ఎడ్లబండ్ల మీద వచ్చి స్నానాలు ఆచరించేవారని చెబుతుంటారు. ఈ నదీ తీరాన మోద్గల్య మహర్షి తపస్సు చేసిన ప్రాంతంగా పేరుగాంచడంతో ఆ మహర్షిని దర్శిం చుకునేందుకు భక్తులు పెద్ద ఎత్తున తరలి వచ్చేవారని పూర్వీకులు చెబు తారు. చుట్టుపక్కల ఫ్యాక్టరీలు నెలకొలడం, ఎగువ నుంచి మురుగు రావడంతో మురికి కూపంగా తయారైందని భక్తులు అంటున్నారు. ఇటువంటి పుణ్యక్షేత్రాన్ని కాపాడే విధంగా ప్రతీఒక్కరూ నడుం బిగించాలని కోరుతున్నారు.



కరపత్రాలు ఆవిష్కరించిన సభ్యులు

19 నుంచి 21 వరకు గోస్తనీ నది తీర్థోత్సవాలు

గోస్తనీ నది వద్ద ఈనెల 19వ తేదీ నుంచి 21 వరకు 93వ తీర్థోత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వా హకులు డాక్టర్ గాదిరాజు కృష్ణంరాజు తెలి పారు. వేంకటేశ్వర స్వామి ఆలయం వద్ద శనివారం కమిటీ సభ్యులు విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. సభ్యులు మాట్లాడుతూ ఈ పుణ్య నది వద్ద 93 సంవత్సరాలుగా ఉత్సవాలు నిర్వహిస్తూ వస్తున్నామన్నారు. ఉత్సవాల్లో భాగంగా 19వ తేదీన శ్రీరామచంద్రమూర్తి, వేంకటేశ్వరస్వామి వార్లను పెళ్లి కుమారుడిని చేయడం, దీక్ష ధారణ, ధ్వజారోహణ, తదితర పూజలు నిర్వహిస్తామన్నారు. మూడురోజుల పాటు సాంస్కృతిక కార్యక్రమా లతో పాటు అన్న సమారాధన, శ్రీకోదండరామ, శ్రీవెంకటేశ్వరస్వామి వార్ల కళ్యాణం, నిర్వహి స్తామన్నారు. గాదిరాజు లక్ష్మణరాజు, సీతారామరాజు, అయ్యగారి హనుమంతరావు, గాదిరాజు సీతారామరాజు, కొత్తపల్లి సూర్య నారాయణ రాజు, వేగేశ్న గోపాలకృష్ణంరాజు, తదితరులు పాల్గొన్నారు.



స్వాధీనం చేసుకున్న నాటు తుపాకులు చూపిస్తున్న పోలీసులు

నాటు తుపాకులు స్వాధీనం..నలుగురు అరెస్ట్

గణపవరం, ఫిబ్రవరి 17: ఆక్వా చెరువులపై పిట్టలను బెదరగొట్టడానికి అక్రమంగా ఆయుధాలు వినియోగిస్తున్న నాలుగు నాటు తుపాకులను గణపవరం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. శనివారం గణపవరం పోలీస్‌స్టేషన్‌లో ఏలూరు డీఎస్పీ శ్రీనివాసులు వివరాలు వెల్లడించారు. గణపవరంలోని చినరామచంద్రపురం వైఎస్సార్ కాలనీలో నాటు తుపాకులు కలిగిన నిందితులు సంచరిస్తున్నారన్న సమాచారం మేరకు నిడమర్రు సీఐ ఎంవీ.సుభాష్, ఎస్సై వెంకటేశ్వరరావు, సిబ్బందితో శనివారం దాడి చేశారు. ఎటువంటి అనుమతులు లేని నాలుగు నాటు తుపాకులు నలుగురిని పట్టుకున్నారు. నెల్లూరు జిల్లాకు చెందిన నక్కల శివకుమార్, తమిళనాడుకు చెందిన మీనంపాతం రవి, అజయ్, నక్కల మురళీ అలియాస్ మక్రాసింగ్‌ను అరెస్టు చేసినట్టు డీఎస్పీ తెలిపారు. రొయ్యలు, చేపల చెరువులపై పక్షులను వెళ్లగొట్టేందుకు అనుమతులు లేని నాటు తుపాకులు ఉపయోగిస్తే చెరువుల యాజమానులపైనా ఆయుధాల చట్టం కింద చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.



కవిటంలో అతిరుద్ర మహా యాగం నిర్వహిస్తున్న దృశ్యం

వైభవంగా కోటప్పకొండ కోటేశ్వరస్వామి కల్యాణం



పోడూరు, ఫిబ్రవరి, 17 : పోడూరు మండలం కవిటంలో అతిరుద్ర మహా యాగం మహోత్సవాలు 7వ రోజు శనివారం ఘనంగా జరిగాయి. వేద పండితులు రుద్రహోమం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. రుత్వికులచే రుద్ర పారాయణలు ఈశ్వరునికి అభిషేకం నిర్వహించారు. అతి రుద్ర యాగ మహోత్సవాల్లో భాగంగా రాత్రి 7 గంటలు నుంచి మేళ తాళాలతో, పండితుల మంత్రోర్చనలతో భక్తజన సందోహం మధ్య కన్నుల పండువుగా కోటప్పకొండ మహా క్షేత్రంలో వెలసిన పార్వతీ సహిత కోటేశ్వర స్వామికి కల్యాణం నిర్వహించారు.



ఆచంటలో నిర్మాణుష్యంగా ఉన్న రహదారి

మంచు.. ఎండ..చలి

ఆచంట, ఫిబ్రవరి 17: ఈసారి ఫిబ్రవరి ప్రారంభంలోనే ఎండలు దంచి కొడుతున్నాయి. ఎండ తీవ్రత పెరగడంతో పాటు ఉక్కబోత కూడా మొదలైంది. మధ్యాహ్నం ఎండ తీవ్రత కారణంగా రోడ్లు సైతం నిర్మాణుష్యంగా మారుతున్నాయి. కొన్ని రోజులుగా ఉదయం పొగ మంచు, మధ్యాహ్నం ఎండ, సాయంత్రం చలి వాతావరణం ఉంటుంది.



మాధవాయిపాలెం రేవు వద్ద ఏర్పాటు చేసిన టెంట్‌లు

అంతర్వేది తిరునాళ్ళకు రేవులో ఏర్పాట్లు

నరసాపురం, ఫిబ్రవరి 17: మాధవాయిపాలెం-సఖినేటిపల్లి మీదుగా అంతర్వేది తిరునాళ్ళకు వెళ్లే యాత్రికుల కోసం నరసాపురం రేవులో అధికారులు ఏర్పాట్లు చేపట్టారు. ప్రయాణికులతో పాటు యాత్రికులు పెద్ద సంఖ్యలో తిరునాళ్ళకు వెళ్లే అవకాశం ఉండటంతో రేవులో ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా బారిగేడ్లు ఏర్పాటు చేశారు. రెండు లైన్లతో పాటు పంటులు వచ్చే వరకు ఎండలో నిలబడకుండా టెంట్‌లు వేశారు. మరుగుదొడ్లు, మంచినీటి సదుపాయం, మెడికల్ క్యాంపు, రేవుల్లో గజ ఈతగాళ్ళను కూడా ఏర్పాటు చేయనున్నారు. వారం రోజుల పాటు జరిగే ఈ తిరునాళ్ళకు రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల నుంచి మాధవాయిపాలెం రేవు గుండా దాటడం ఆనవాయితీ. దానికి అనుగుణంగా ముందస్తు ఏర్పాట్లు చేపడుతున్నారు.

బియ్యపుతిప్ప రేవు మూసివేత

2010లో బియ్యపుతిప్ప వద్ద జరిగిన పడవ ప్రమాదంతో అప్పటి నుంచి ఈ రేవును అంతర్వేది తిరునాళ్ల సమయంలో మూసివేస్తూ వస్తున్నారు. అంతర్వేది వెళ్లేందుకు ఇది దగ్గర మార్గం కావడంతో కృష్ణా జిల్లాతో పాటు ఇతర ప్రాంతాలకు చెందిన చాలామంది యాత్రికులు ఈ మార్గం గుండా గోదావరి దాటి అంతర్వేది వెళతుంటారు. అయితే సముద్రం కలిసే ప్రదేశం కావడం, లోతు ఎక్కువగా ఉండటంతో ప్రమాదం జరిగే అవకాశం ఉండటంతో అప్పటి నుంచి రేవును మూసివేశారు. రేవులో ఎటువంటి రాకపోకలు జరగకుండా సచివాలయ సిబ్బంది, వలంటీర్లతో పాటు రెవెన్యూ, పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో రమణరావు తెలిపారు.

అయినవారికి ఆపరేటర్ పోస్టు

దూసనపూడి పంచాయతీలో పంపు ఆపరేటరు పోస్టు భర్తీలో అవకతవకలు

పంచాయతీ అధికారులకు ఫిర్యాదు



వీరవాసరం, ఫిబ్రవరి17: దూసనపూడి గ్రామ పంచాయతీ పరిధిలో తాగునీటి సరఫరా నిర్వహణ పనుల నిమిత్తం అధికారులు టెండర్లు పిలిచారు. తక్కువ వేతనానికి టెండర్ వేసిన వ్యక్తిని కాదని అధిక టెండరు వేసిన వేరొకరికి పంపు ఆపరేటరు కొలువు అప్పగించారు. గతంలో పనిచేస్తున్న పంపు ఆపరేటరును తొలగించేందుకు ఉద్దేశపూర్వకంగానే ప్రజా ప్రతినిధులు, కార్యదర్శి వ్యవహరించారని చెబుతున్నారు. గ్రామంలో పంపు ఆపరేటరు నిమి త్తం టెండర్లు స్వీకరిస్తున్నామని దండోరా వేయించారు. ఒక పోస్టుకు నలుగురు టెండర్లు దాఖలు చేశారు.చాబత్తుల సునీల్ నెలకి వేతనంగా రూ.7,999 కి, చాబత్తుల లక్ష్మణరావు రూ.8,099కి ,కొల్లా ఆదిలక్ష్మి రూ.10,500కు, ఓదూరి వీరన్నబాబు రూ.8,430 కులకు టెండర్లు దాఖలు చేశారు. నిబంధనల మేరకు తక్కువ టెండరు వేసిన సునీల్‌ను పంపు ఆపరేటరుగా ఎంపిక చేయాల్సి ఉంది. కానీ రూ.8,430 లకు టెండరు వేసిన వీరన్నబాబును ఎంపికచేశారు. దీనిపై పలు విమర్శలు వెలువెత్తుతున్నాయి. ఆపరేటరు ఎంపికకు సంబంధించి అనుభవజ్ఞులను ఎంపిక చేయాల్సి ఉండగా అనుభవానికి సంబంధించిన ధ్రువీకరణ పత్రాలను అందజేయలేదు. నిబంధనలు విస్మరించి టెండర్లు తెరిచి వారికి ఇష్టమైన వ్యక్తికి టెండరును అంగీకరించారు. దీనిపై మిగిలిన వారు పంచాయతీ శాఖ అధికారులను ఆశ్రయించి విచారణ చేయాలని ఫిర్యాదు చేశారు.

పాపికొండల్లో చేపల మాఫియా

నిషేధిత వలలతో అక్రమంగా చొరబాటు

అడిగితే తుపాకులతో బెదిరింపులు

లక్షల విలువైన మత్స్య సంపద తరలింపు

అధికార పార్టీ ఎంపీపీ అండ



పోలవరం, ఫిబ్రవరి 17 : పాపికొండల అభయారణ్యంలో నిబంధనలకు విరుద్ధంగా కొంతమంది అక్రమ చేపల వేట కొనసాగిస్తున్నారు. అడ్డుకోవడానికి వెళ్లిన స్థానిక నిర్వాసిత మత్స్యకారులపై తుపాకులు, వేట కొడవళ్లతో బెదిరింపులకు పాల్పడుతున్నారు. పోలవరం ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా పోలవరం ప్రాజెక్టు ఎగువన ఉన్న గ్రామాలన్నీ ఖాళీ చేయడంతో పాటు మత్స్యకారులను సైతం అధికారులు దిగువ ప్రాంతాలకు తరలించారు. ఈ నేపథ్యంలో ఎగువ గ్రామాలు ఖాళీ కావడం ప్రాజెక్టు ఎగువన చేపల వేట లేకపోవడం వల్ల మత్స్య సంపద పెరిగింది. ఈ మత్స్య సంపదపై కొందరు అధికార పార్టీల నాయకుల కన్ను పడడంతో దోచుకోవడానికి సరికొత్త మార్గాలు ఎంచుకున్నారు. అధికార పార్టీకి చెందిన ఒక ఎంపీపీ అండదండలతో వేర్వేరు ప్రాంతాల నుంచి వందలాది మంది మత్స్యకారులు, పడవలు, చీరమేను అవిలీ (అప్పుడే పుట్టిన చేపలను పట్టే సన్న కన్నాలు గల వల) ఐలా అనబడే వలలతో పోలవరం ప్రాజెక్టు ఎగువన పాపి కొండల అభయారణ్యంలో మకాం వేశారు. చిన్న చేపలను సైతం వేటాడి అక్కడే ఎండబెట్టి తూర్పుగోదావరి జిల్లా పోశమ్మ గుడి ప్రాంతానికి తీసుకొచ్చి అక్కడి నుంచి లారీల్లో ఇతర ప్రాంతాల కోళ్ళ ఫారాలకు తరలిస్తున్నారు. కోళ్ళ దాణా చేపలకు గిరాకీ ఎక్కువ ఉండడం 50 కిలోల బస్తా ఒకటి రూ.16 వేలు పలుకుతుండడంతో రోజుకి ముప్పై లక్షల రూపాయల మత్స్య సంపదను తరలిస్తున్నారు. కోట్లాది రూపాయల ఆదాయం వస్తుండడంతో అధికార పార్టీ నాయకులు వారికి కొమ్ము కాస్తూ అక్రమ దందాకు అండగా నిలిచి అధికారులను సైతం బెదిరింపులకు గురి చేస్తున్నారు. ఈ దందా రెండు నెలల క్రితం కుక్కునూరు, వేలేరుపాడు మండలాల్లో ప్రారంభం కాగా అక్కడి మత్స్యకారులు పోలీస్ స్టేషన్లలో ఫిర్యాదు చేశారు. దీంతో అక్కడ నుంచి చేపల మాఫియా పాపికొండల అభయారణ్యంలో తమ దందా ప్రారంభించారు.

పోలవరం ప్రాజెక్టు ఎగువ ప్రాంతాలైన కొత్తూరు, కొండ్రుకోట, చీడూరు, టేకూరు నిర్వాసిత గ్రామాల మత్స్యకారులు పోలవరం ప్రాజెక్టు దిగువకు వచ్చిన తర్వాత మత్స్య సంపద తగ్గి ఉపాధి కోల్పోతుండడంతో అటు అటవీశాఖ అధికారులు, ఇటు ఇరిగేషన్ అధికారులు ప్రాజెక్టు ఎగువన పరిమితి విధించిన మేర వేటాడుకుని తిరిగి వచ్చేలా వెసులుబాటు కల్పించారు. అయితే ఇటీవల చేపల మాఫియా చిన్న చిన్న చేపపిల్లలను కూడా పట్టి నిషేధిత వేట కొనసాగిస్తుండడంతో చేపల సంతతి తగ్గిపోయింది. దీంతో మత్స్య సంపద తగ్గి మత్స్యకారులు ఉపాధి కోల్పోతు న్నారు. వారిని అడ్డుకోవడానికి ప్రయత్నించగా వేట కొడవళ్లతో నాటు తుపాకులతో బెదిరించడంతో రక్షణ కల్పించాలంటూ స్థానిక మత్స్యకారులు అటవీ క్షేత్రాధి కారికి వినతిపత్రం సమర్పించారు. అక్రమంగా వేట సాగిస్తున్న మత్స్యకారులు సైతం ముంపు ప్రాంతాల వారేనని వారికి అండగా నిలిచిన ఆ ఎంపీపీ వంత పాడడంతో అటవీశాఖ అధికారులు ఇరు వర్గాల వారిని సమావేశ పరిచి ఎవరు స్థానికులు ఎవరు కాదనే విషయంపై స్పష్టత వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని తెలిపారు. నిషేధిత వలలతో అక్రమ చేపల వేట చేస్తున్న మత్స్యకారులు ఈ ప్రాంతాలకు చెందిన వారు కాదని చేపల వేటతో పాటు అభయారణ్యంలో వన్యప్రాణుల వేట కూడా కొనసాగిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు.

దీనిపై అటవీక్షేత్రాధికారి ఎస్.దావీదు రాజుని వివరణ కోరగా గురువారం పోలవరం రేంజ్, గోకవరం రేంజ్ అటవీశాఖ సిబ్బంది పడవలలో వెళ్లి అక్రమ వేట సాగిస్తున్న వారిని పడవలు, వలలతో తూర్పుగోదావరి జిల్లా పోశమ్మ గండి ప్రాంతానికి తరలించి వేటకు వెళితే అటవీ చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించి పంపినట్టు తెలిపారు. అక్రమ దందాలకు సంపాదనకు అలవాటు పడిన చొరబాటు దారులు వేలేరుపాడు, కుక్కునూరు, కొయిదా, పోచవరం, పేరంటాలపల్లి ప్రాంతాల నుంచి వచ్చే అవకాశాలున్నాయని అటు వీఆర్‌పురం, కుక్కునూరు, వేలేరుపాడు మండలాల పరిధిలో అటవీశాఖ, మత్స్యశాఖ ఆధ్వర్యంలో పర్యవేక్షణ ఉండాలని మత్స్యకారులు కోరుతున్నారు.

తూర్పు నుంచి చొరబాటు..

పోలవరం ప్రాజెక్టు ఎడమ కాలువ వైపు తూర్పుగోదావరి జిల్లా గోకవరం ప్రాంతం నుంచి చొరబాటుదారులు వస్తున్నా అడ్డుకోవాల్సిన అటవీశాఖ అధికారులు, పోలవరం ప్రాజెక్టు చెక్‌పోస్టు అధికారులు మామూళ్ల మత్తులో అనుమతిస్తున్నారని స్థానిక మత్స్యకారులు ఆరోపిస్తున్నారు. పోలవరం ప్రాజెక్టులోకి వెళ్లాలంటే అనుమతులు ఉండాలని అధికారులు అధిక సంఖ్యలో మత్స్యకారుల్ని ఎలా అనుమతిస్తున్నారని ప్రశ్నిస్తున్నారు. అభయారణ్యంలో గ్రామాలు ఖాళీ చేసి అటవీశాఖకు అప్పగించడంతో నదిలో మొసళ్లు, వన్య ప్రాణుల సంతతి పెరుగుతున్న తరుణంలో వేటలు కొనసాస్తుంటే వాటి మనుగడకు ప్రమాదమని వన్యప్రాణి ప్రియులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

'శాశ్వత లోక్ అదాలత్‌తో ఉచితంగా న్యాయం'



సదస్సులో మాట్లాడుతున్న మేరీ గ్రేస్‌కుమారి

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17 : శాశ్వత లోక్‌అదాలత్ ద్వారా ఉచితంగా న్యాయాన్ని పొందవచ్చని ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పర్మినెంట్ లోక్ అదాలత్ ఛైర్‌పర్సన్ ఎ.మేరీ గ్రేస్ కుమారి అన్నారు. ఏలూరు జిల్లా కోర్టు ఆవరణలో ఉన్న జిల్లా న్యాయసేవాధికార సంస్థ భవనంలో పర్మినెంట్ లోక్‌అదాలత్ అందించే సేవలపై సంబంధిత అధికారులతో శనివారం సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పోస్టల్, రవాణా, ఇన్సూరెన్స్, బ్యాంకింగ్, విద్య, వైద్య, జాతీయ ఉపాధి హామీపథకం, రియల్ ఎస్టేట్ మొదలైన సేవలలో లోపం జరిగిన న్యాయం పొందడానికి శాశ్వత లోక్‌అదాలత్‌లో అర్జీ చేసుకోవచ్చన్నారు. ఎటువంటి రుసుము చెల్లించాల్సిన అవసరం లేదని ఇరువురికి కౌన్సెలింగ్ చేసి రాజీ చేస్తామన్నారు. ఇక్కడ ఇచ్చిన తీర్పుపై అప్పీలు ఉండదని తెలిపారు.

జిల్లాలో ఎస్ఈబీ విస్తృత దాడులు


సారా, బెల్లపు ఊటను స్వాధీనం చేసుకున్న అధికారులు

ఏలూరు క్రైం, ఫిబ్రవరి 17 : జిల్లాలో ఎస్ఈబీ అధికారులు విస్తృతంగా దాడులు నిర్వహించారు. చింతలపూడి మండలం నాగిరెడ్డిగూడెంలో వంద లీటర్ల సారా సీజ్ చేసి, 1700 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. రెండు కేసులు నమోదు చేశారు. టి.నరసాపురం మండలం మధ్యాహ్నపువారిగూడెంలో 20 లీటర్ల సారా స్వాధీనం చేసుకుని 600 లీటర్ల బెల్లపు ఊటను ధ్వంసం చేశారు. దాడుల్లో ఎస్ఈబీ ఇన్‌స్పెక్టర్ సునీల్‌కుమార్, చింతలపూడి సబ్ ఇన్‌స్పెక్టర్ వీఎస్ఎస్‌వీ ప్రసాద్, డీటీఎఫ్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, ఎస్ఐ.మోహనరావు, ఏఎస్ఐ పూర్ణ, సిబ్బంది పాల్గొన్నారు.


ఆగడాలలంకలో గన్ని ప్రచారం, ఏలూరులో పథకాలు వివరిస్తున్న చంటి, జంగారెడ్డిగూడెం మండలంలో టీడీపీ యువ నేత బొమ్మాజీ అనిల్

టీడీపీ-జనసేన కూటమిని గెలిపించాలి

» టీడీపీ జిల్లా అధ్యక్షుడు గన్ని వీరాంజనేయులు

భీమడోలు, ఫిబ్రవరి 17 : రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం, జనసేన కూటమిని గెలిపించాలని, అధికారంలోకి లంక గ్రామాలకు తాగునీటి కొరత తీరుస్తామని టీడీపీ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు అన్నారు. శనివారం ఆగడాలలంకలో 'మన ఇంటికి మన గన్ని కార్యక్రమం' నిర్వహించారు. ఈ సందర్భంగా ఆగడాలలంక గ్రామం అంతా పసుపుమయమైంది. పెద్దఎత్తున గ్రామస్థులు గన్నికి ఘన స్వాగతం పలికారు. ఆయన మాట్లాడుతూ గతంలో తెలుగుదేశం హయాంలో జరిగిన అభివృద్ధే తప్ప ఈ నాలుగున్నరేళ్ళలో అభివృద్ధి శూన్యమన్నారు. తన హయాంలో రూ.27 కోట్లతో వేసిన రోడ్డు తప్ప వైసీపీ ప్రభుత్వం ఒక్క రోడ్డు కూడా వేయలేదని విమర్శించారు. అనంతరం గ్రామంలో రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. నియోజకవర్గ, మండల టీడీపీ నేతలు, జనసైనికులు హాజరయ్యారు.

నవరత్నాల పేరుతో మోసాలు : బడేటి చంటి

ఏలూరుటూటౌన్ : నవరత్నాల పేరుతో ప్రజలను జగన్ మోసం చేస్తున్నాడని ఏలూరు ఆసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి బడేటి చంటి ఆగ్రహం వ్యక్తంచేశారు. 17వ డివిజన్‌లో శనివారం పాదయాత్ర నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి మిని మ్యేనిఫెస్టోలోని సూపర్ 6పథకాలను వివరించారు. చోడే వెంకటరత్నం, వీరంకి త్రినాద్, వీరమాచి నేని చందు, అంబికా రఘు, రాజగోపాల్, వెంకటేశ్వరరావు, కృష్ణమోహన్, శ్రీను, నెహ్రూ పాల్గొన్నారు.

ప్రజల్లోకి సూపర్ సిక్స్ పథకాలు : బొమ్మాజీ అనిల్

జంగారెడ్డిగూడెం టౌన్ : టీడీపీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్ళడమే లక్ష్యమని టీడీపీ యువ నాయకుడు బొమ్మాజీ అనిల్ అన్నారు. శనివారం శ్రీనివాసపురం, కేతవరం పంచాయతీల్లో అనిల్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. శ్రీనివాసపురం గ్రామ పార్టీ అధ్యక్షుడు సత్యనారాయణ, టీడీపీ సీనియర్ నాయకులు ఎల్కే ప్రసాద్, కేతవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు ధర్మేంద్ర, సుబ్బారావు, టౌన్ పార్టీ వైస్ ప్రెసిడెంట్ కొండేటి కిషోర్, పార్టీ మండలం అధ్యక్షుడు సాయిల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

వైసీపీకి బుద్ధి చెప్పండి : బొరగం

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17 : అసమర్థ పాలనతో ప్రజలకు ప్రత్యక్ష నరకాన్ని చూపుతున్న జగన్‌రెడ్డి పార్టీ వైసీపీకి రానున్న ఎన్నికల్లో గట్టి బుద్ధి చెప్పాలని నియోజకవర్గ కన్వీనర్ బొరగం శ్రీనివాస్ తెలిపారు. శనివారం రామన్నగూడెంలో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమాన్ని నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించి ఇంటింటికి తిరుగుతూ రైతు కూలీల వద్దకు టీడీపీ జనసేన అధికాంలోకి వస్తే అమలుచేసే సూపర్ సిక్స్ పథకాలను వివరించారు. చంద్రబాబు సీఎం అయితేనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో నాయకులు సున్నం నాగేశ్వరరావు, మడకం రామకృష్ణ, సరియం జయరాజు, బి.నాగభూషణం, కె.ముక్కయ్య, నిమ్ము నాగు, పూనెం బోడయ్య, నిమ్ము కృష్ణ, మెడియం సింగరాజు, పసుమర్తి భీమేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నా భవిష్యత్తును మీరే నిర్ణయించాలి

» ఆత్మీయ సమావేశంలో నూజివీడు టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయిన


బావోద్వేగానికి గురైన ముద్దరబోయిన

నూజివీడు, ఫిబ్రవరి 17: రాష్ట్రానికి చంద్రబాబు ఎంత అవసరమో నూజివీడుకు ముద్దరబోయిన అవసరం అంత ఉందని పలువురు టీడీపీ నాయకులు స్పష్టం చేశారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ ఇన్‌చార్జి మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సంద ర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ 'నియోజకవర్గానికి ముద్దరబోయిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఆయనను మాకు ఇవ్వండి, గెలిపించి మీ దగ్గరకు పంపి స్తాం' అంటూ సభాముఖంగా చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ముద్దరబోయిన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చంద్రబాబుని కలిసినప్పుడు మీ ట్రాక్ రికార్డు బాగున్నా కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల టిక్కెట్ మార్చాల్సి వస్తోందని చెప్పారన్నారు. రెండు రోజులు సమయం తీసుకుని ఐ.వి.ఆర్ సర్వే ద్వారా నన్ను, మీరు టిక్కెట్ ఇవ్వదలచుకున్న అభ్యర్థి గురించి నియోజకవ ర్గంలో సర్వే చేసి, నాకు అనుకూలంగా ఉంటే ఫోన్ చేసి పిలవాలని ఆయనకు విజ్ఞప్తి చేశానన్నారు. నా రాజకీయ భవిష్యత్తును కార్యకర్తలుగా మీరే నిర్ణయించండి. మీ నిర్ణయమే నాకు శిరోధార్యం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అందరూ ఆయనను ఓదార్చారు. నాలుగు మండలాలు, పట్టణం నుంచి భారీసంఖ్యలో కార్యకర్తలు, నాయకులు సమావేశానికి హాజరయ్యారు.



చింతలపూడి సదస్సులో మాట్లాడుతున్న డీటీ షకీలున్నీసా, పెదవేగిలో ఈవీఎంలపై డ్వాక్రా మహిళల ప్రదర్శన, ఉంగుటూరులో ఓటు హక్కుపై మానవహారం

ఓటు హక్కు వజ్రాయుధం

» ఓటు హక్కు అవగాహనపై పట్టణ, గ్రామాల్లో ర్యాలీలు

చింతలపూడి, ఫిబ్రవరి 17 : ప్రతి పౌరుడికి ఓటు హక్కు వజ్రాయుధం వంటిదని చింతలపూడి డిప్యూటీ తహసీల్దార్ ఎస్.కె.షకీలున్నీసా అన్నారు. శనివారం స్థానిక వెలుగు కార్యాలయంలో జరిగిన అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. 18 ఏళ్ల నిండిన ప్రతీ ఒక్కరూ ఓటు నమోదు చేసుకుని వినియోగించుకో వాలన్నారు. తొలుత ర్యాలీ నిర్వహించి నినాదాలు చేశారు. మండల పరిషత్ ఏవో కామేశ్వరి, వెలుగు ఏపీఎం జ్యోతి ర్యాలీలో పాల్గొన్నారు.

- లింగపాలెం : ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని ఎంపీడీవో ఒరుదు రాంబాబు అన్నారు. శనివారం లింగపాలెంలో ఎంపీడీవో రాంబాబు ఆధ్వర్యంలో ఓటర్లకు అవగాహన కార్యక్రమం నిర్వహించి అనంతరం ర్యాలీ చేపట్టారు. ఆయన మాట్లాడుతూ మండలంలో నూరుశాతం పోలింగ్ నమోదయ్యేలా అవగాహన కల్పిస్తామన్నారు. ఈవోపీఆర్‌డీ జె.ఎమ్‌రత్నకుమార్, ఏపీఎం కమల, వెలుగు సిబ్బంది, గ్రామస్థులు పాల్గొన్నారు.
- కుక్కునూరు : స్వీప్ ఆధ్వర్యంలో 18 ఏళ్ళు నిండిన యువత ఓటు హక్కు నమోదు చేయించుకోవాలని తహసీల్దార్ అచ్యుత కుమారి అన్నారు. శనివారం ఓటు హక్కుపై అవగాహన ర్యాలీని ఆమె ప్రారంభించారు. ఎంపీడీవో నరసింహారావు, ఏపీఎం భానుమతి పాల్గొన్నారు.
- నిడమర్రు : అర్హులందరూ ఓటు నమోదు చేసుకుని, ఓటు వేయడం ద్వారా ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించుకోవచ్చని నిడమర్రు తహసీల్దార్ పోసిబాబు అన్నారు. శనివారం నిడమర్రు వెలుగు కేంద్రలో బీఎల్‌వో, డ్వాక్రా మహిళలతో కలసి స్వీప్ అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎంపీడీవో శివరామకృష్ణయ్య, ఎంఈవో కె.రాంబాబు, ఏపీఎం టి.నాగేశ్వరరావు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.
- ఉంగుటూరు : రానున్న ఎన్నికలలో ఓటు హక్కు ప్రాధాన్యతపై శనివారం స్థానిక ఎంపీడీవో, ఐకేపీ కార్యాలయంలో స్వయం సహాయక సంఘాల ప్రతినిధు లు, సీసీలకు అవగాహన కల్పించారు. తహసీల్దార్ కె.వెంకట శివయ్య, ఎంపీడీవో శర్మ, ఈవోపీఆర్‌డీ, ఐకేపీఏపీ ఎం.పద్మావతి స్వయం సహాయక సభ్యులు పాల్గొన్నారు.

ఈవీఎంలపై అవగాహన ఉండాలి

పెదవేగి, ఫిబ్రవరి 17 : ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలపై అవగాహన ఉంటేనే ఓటు వేసే సమయంలో ఇబ్బందులు తలెత్తవని పెదవేగి తహసీల్దారు ఎం.సూర్యప్రభ అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎలక్ట్రానిక్ ఓటింగ్ ద్వారా ఏ విధంగా ఓటును వినియోగించుకోవాలనే అంశంపై ప్రజలకు అవగాహన కల్పించడానికి అనువుగా డ్వాక్రా మహిళలకు శనివారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఈవీఎంల వినియోగంపై చాలామంది ఓటర్లకు సరైన అవగాహన లేదన్నారు. దీనిపై ఓటర్లకు అవగాహన కల్పించడానికి అనువుగా తొలుత డ్వాక్రా మహిళలకు అవగాహన కల్పిస్తామన్నారు. ఆపై డ్వాక్రా మహిళలు గ్రామాల్లో అవగాహన కల్పిస్తారన్నారు. మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ, డ్వాక్రా మహిళలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి నివేదిక ఇవ్వాలి

» ఐటీడీఏ పీవో సూర్యతేజ ఆదేశం


మాట్లాడుతున్న పీవో సూర్యతేజ

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17: పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేసి ప్రతి శుక్రవారం సెక్టారు అధికారులు నివేదికలు రిటర్నింగ్ అధికారికి ఇవ్వాలని ఐటీడీఏ పీవో, ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఎం.సూర్యతేజ ఆదేశించారు. పోలవరం (ఎస్టీ) నియోజకవర్గంలోని మండలాల్లోని పోలింగ్ స్టేషన్లలో ఎన్నికల నిర్వహణకు ఏర్పాట్లు, వసతుల కల్పనపై శనివారం నియోజ కవర్గంలోని సెక్టారు అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి తీసువాల్సిన చర్యలపై సూచనలు చేశారు. సమస్యాత్మక గ్రామాలు, అత్యంత సమస్యాత్మక గ్రామాలు, బెదిరింపులు, ప్రలోభాలు, ముంపు ప్రాంతాల గుర్తింపు ముఖ్యమైన వాటిపై చర్చించారు. కార్యక్రమంలో ఎస్‌డీసీ నాగేశ్వరరావు, సెక్టారు అధికారులు పాల్గొన్నారు.

'ఫిర్యాదులు తెలుసుకోకుండా సస్పెన్షన్లు బాధాకరం'

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17: రాష్ట్రంలో ఓటర జాబితాలో పొరపాట్లు, ఫిర్యాదులపై కనీసం ఏం జరిగిందో తెలుసుకోకుండా బీఎల్‌వోలుగా విధులు నిర్వహిస్తున్న వారికి షోకాజ్ నోటీసులు ఇవ్వ కుండా నేరుగా జిల్లా కలెక్టర్లు సస్పెండ్ చేయడాన్ని ఏపీ రాష్ట్ర గ్రామ రెవెన్యూ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు భూపతిరాజు రవీంద్రరాజు తీవ్రంగా ఓ ప్రకటనలో ఖండిం చారు. ఉద్యోగస్థులు ఒక బీఎల్‌వో డ్యూటీ కాకుండా వారి విధి నిర్వహణలో అనేక రకాల విధులు నిర్వహిస్తున్నారన్నారు. బీఎల్‌వో విధుల్లో చిన్నచిన్న పొరపాట్లను సాకుగా చూపి క్రిందిస్థాయిలో చిన్న ఉద్యోగులను సస్పెన్షన్‌కు గురిచేయడం బాధాకర మన్నారు. ఈ విషయంపై జిల్లాల అధికారులు పున రాలోచించాలని సస్పెండ్ చేసిన బీఎల్‌వోలను తిరిగి విధుల్లోకి తీసుకో వాలని డిమాండ్ చేశారు. ఇటీవల పశ్చిమగోదావరి జిల్లాలో 30మంది బీఎల్‌వోలను సస్పెండ్ చేశారని, వారిని అందర్ని విధుల్లోకి తీసుకోవాలని కోరగా అధికారులు స్పందించారని తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా సస్పెండ్ చేసిన బీఎల్‌వోలను వెంటనే విధుల్లోకి తీసుకోవాలని.. అధికారులు స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా బీఎల్‌వోలందరూ విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

భావనా రుషి స్వామికి చింతమనేని పూజలు


భావనా రుషి స్వామి ఆలయంలో పూజలు చేస్తున్న చింతమనేని

దెందులూరు, ఫిబ్రవరి 17 : కొవ్వలి గాంధీనగర్‌లోని శ్రీభద్రావతి సమేత భావనా రుషి స్వామి సన్నిధిలో మాజీ ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ ప్రత్యేక పూజలు నిర్వహించారు. కొవ్వలిలోని భద్రావతి సమేత భావనారుషి స్వామి ఆల యంలో 39వ కల్యాణ మహోత్సవంలో భాగంగా ఆయన పూజలు చేశారు. పద్మశాలీల సంఘం పెద్దలు జగిలింకి అప్పారావు, ఉమమహేశ్వరావు, నీల య్య, రాజారావు, మోహన్‌రావు తదితరులు ఆయనకు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ సంతోషంగా ఉండాలని ఆకాంక్షించారు. టీడీపీ నేతలు కె.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు,

ప్రతి ఏడాది పేరంటాలమ్మను దర్శించుకుంటా : డీఎస్పీ

దెందులూరు, ఫిబ్రవరి 17 : ప్రతి ఏడాది అచ్చమ్మ పేరంటాలు తల్లి ఉత్సవాలకు ఎక్కడ ఉన్నప్పటికీ తప్పనసరిగా వచ్చి దర్శించుకోవడం ఆనవాయితీగా మారిందని ఒంగోలు పోలీసు శిక్షణ కేంద్రం డీఎస్పీ మేకా సుధాకరావు తెలిపారు. గాలాయగూడెం అచ్చమ్మపేరంటాలమ్మ తల్లి ఉత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. రెండో రోజు శనివారం అమ్మవారిని ఆయన కుటుంబ సమేతంగా విచ్చేసి దర్శించుకున్నారు. ఆలయకమిటీ సభ్యులు వారికి పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. ఉత్సవాల్లో భాగంగా పలు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి ఆలయ ఆవరణలో సినీ మ్యూజికల్ నైట్ నిర్వహించగా వందలాది మంది భక్తులు తిలకించారు.

తోకలపల్లిలో 'జనంలోకి జనసేన'


తోకలపల్లిలో స్థానికులను కలసిన ధర్మరాజు

నిడమర్రు ఫిబ్రవరి 17:కొల్లేటి ప్రాంత ప్రజలను ఆదుకునే నాయకుడు పవన్‌కల్యాణ్ మాత్రమే అని జనసేన ఉంగుటూరు నియోజకవర్గ ఇన్‌చార్జి పత్సమట్ల ధర్మరాజు అన్నారు. శనివారం తోకలపల్లిలో జనంలోకి జనసేన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో మహిళలు పెద్దఎత్తున స్వాగతం పలికి హారతులు ఇచ్చారు. జనసేన నాయకులు తోట శ్రీను, మండల కన్వీనర్లు నిమ్మల దొరబాబు, పి.రాంబాబు, బేతు మురళి, మర్రిపూడి బంటి, బలే విజయ్, బలే చంద్ర, జయమంగళ కృష్ణ పాల్గొన్నారు.

డిప్యూటీ కలెక్టర్ సోమశేఖర్‌కు సత్కారం


సోమశేఖర్‌ను సత్కరిస్తున్న దృశ్యం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17: ఏలూరు తహసీల్దార్‌గా ఐదేళ్ల విశేషసేవలు అందించిన బి.సోమశేఖర్ డిప్యూటీ కలెక్టర్‌గా పదోన్నతి పొంది ఎస్.ఎస్.ఏ కో-ఆర్డినేటర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా సత్కరించారు. కాపు సంక్షేమ సేన జిల్లా కమిటీ అధ్యక్షుడు పులి శ్రీరాములు పట్టుకండువా, వినాయకుడి చిత్రపటాన్ని అందజేసి శనివారం అభినందించారు. నగర అధ్యక్షుడు వాసారాజు, ఎం.చంద్రశేఖర్, పి.రాంబాబు, పన్నీరు బుజ్జి, బడే సతీష్, టి.శ్రీనివాస్, జి.నవీన్‌కుమార్ పాల్గొన్నారు.

మార్చి 9న జాతీయ లోక్ అదాలత్



రికార్డులు తనిఖీ చేస్తున్న న్యాయాధికారి మధుబాబు

చింతలపూడి, ఫిబ్రవరి 17:జాతీయ లోక్ అదాలత్ కార్యక్రమం మార్చి 9వ తేదీన నిర్వహిస్తామని రాజీపడతగ్గ క్రిమినల్, చెక్ బౌన్స్, భూతగాదాలు వంటి కేసులు పరిష్కారం చేసుకోవచ్చని జూనియర్ సివిల్ జడ్జి న్యాయాధికారి సి.మధుబాబు సూచించారు. శనివారం స్థానిక సబ్ జైలును ఆయన తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించి నిందితులకు అందుతున్న ఆహార, వైద్య సౌకర్యాలను తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఖైదీలతో ఆయన మాట్లాడుతూ ఎవరికైనా న్యాయం సహాయం కావాలనుకుంటే న్యాయవాదిని పెట్టుకోలేనివారు న్యాయ సేవల కమిటీ ద్వారా వారికి ఉచితంగా న్యాయవాదిని ఏర్పాటు చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో న్యాయవాదులు డేవిడ్‌రాజు, ఏసుపాదం, ఎం.డి.అక్బర్ ఆలీ, జైలు సూపరింటెండెంట్ గోలి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

హైస్కూల్ ప్లస్ టీచర్లకు అదనపు ఇంక్రిమెంట్

ఏలూరు ఎడ్యుకేషన్, ఫిబ్రవరి 17 :రాష్ట్రవ్యాప్తంగా వున్న 292 హైస్కూల్ ప్లస్ (జడ్పీ జూనియర్ కళాశాల)ల్లో నియమితులైన 1792 మంది స్కూల్ అసిస్టెంట్ కేడర్(పీజీటీ) ఉపాధ్యాయులకు ఒక అదనపు ఇంక్రిమెంట్‌ను మంజూరుచేస్తూ ఖజానాశాఖ శనివారం ఉత్తర్వులు జారీ చేసిందని పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.ఆంజనేయులు ఓ ప్రకటనలో తెలిపారు. సంబంధిత హైస్కూల్ ప్లస్‌లలో విధులు నిర్వర్తించిన కాలానికి మాత్రమే ఈ అదనపు ఇంక్రిమెంట్ ఇస్తారని స్పష్టం చేశారు. మరో స్కూలుకు బదిలీ అయితే ఈ అదనపు ఆర్థిక ప్రయోజనాన్ని కోల్పోతారని వివరించారు. ఇటీవల జాయింట్‌స్టాఫ్ కౌన్సిల్ సభ్యసంఘాల నాయకులతో మంత్రుల ఉపసంఘం, ఆర్థిక శాఖ ఉన్నతాధికారుల సమక్షంలో జరిగిన సమావేశంలో తమ సంఘం లేవనెత్తిన ఈ సమస్యపై స్పందించిన ప్రభుత్వం ఆ మేరకు ఉత్తర్వులు జారీ చేసిందని తెలిపారు.

పేద కుటుంబాలకు ఆర్థిక సాయం

పెదవేగి, ఫిబ్రవరి 17 : ఆర్థికంగా ఇబ్బందుల్లో ఉన్న పేదకుటుంబాలకు అండగా నిలిచి, ఆదుకోవడమే గౌడ సేవా సమితి లక్ష్యమని సమితి ప్రధాన కార్యదర్శి, న్యాయవాది బైగాని రంగారావు అన్నారు. గౌడ సేవా సమితి ద్వారా ప్రతినెల రెండు పేద కుటుంబాలకు అందించే ఆర్థిక సాయంలో భాగంగా ఈనెల కు సంబంధించి కొప్పులవారిగూడెం గ్రామానికి చెందిన మరీదు స్వాతి, మట్టా లక్ష్మి కుటుంబాలకు రెండు నెలలకు సరపడా నిత్యావసర వస్తువులు దుస్తులు, రెండు మిక్సీలతోపాటు రూ.ఆరువేల నగదును రెండు కుటుంబాలకు అందించారు. సమితి ఉపాధ్యక్షుడు బొమ్మగాని బాలకృష్ణ, మారగాని శ్రీనివాస్, సభ్యులు పరసా మోహన్, నాగశ్రీను, శ్రీనివాసరావు, వీరంకి అయ్యప్ప తదితరులు పాల్గొన్నారు.

అగ్ని బాధిత కుటుంబానికి నిత్యావసరాలు అందజేత

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17 : పాత అలివేరులో జరిగిన అగ్నిప్రమాదంలో సర్వం కోల్పోయిన కుంజా కన్నయ్య కుటుంబానికి శనివారం జనసేన నియోజకవర్గ కన్వీనర్ చిర్రి బాలరాజు బియ్యం, నిత్యావసర వస్తువులు, కూరగాయలు, దుప్పట్లు, బట్టలు, ఐదు వేల నగదు అందజేశారు. తపన ఫౌండేషన్ గారపాటి సీతారామాంజనేయ చౌదరి సాయం మేరకు రూ.ఆరు వేల నగదు విలువైన వంట సామగ్రిని శనివారం బీజేపీ నాయకులు పంపిణీ చేశారు. కన్వీనర్ కె.రామకృష్ణ, బీజేపీ నాయకులు వంకా కాంచనమాల, డి.సీతారామాంజనేయులు, సోము హరినారాయణ, సేవా ప్రతినిధులు పాల్గొన్నారు.

బాల్యవివాహాలు చట్టరీత్యా నేరం

జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 17:బాల్యవివాహాలను సమర్థించడం చట్టరీత్యా నేరమని జంగారెడ్డిగూడెం జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ కిషోర్‌కుమార్ సూచించారు. శుక్రవారం స్థానిక కోర్టు ప్రాంగణంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు న్యాయ విజ్ఞాన సదస్సును నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ బాల్యవివాహాలకు పాల్పడిన వారు చట్టరీత్యా శిక్షార్హులవుతారన్నారు. బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అచ్యుత శ్రీనివాసరావు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో న్యాయవాదులు మహిళల చట్టాలు, వృద్ధుల హక్కులపై అవగాహన కల్పించారు. అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ శ్యామలాదేవి, న్యాయవాదులు ఏవీవీ భువనేశ్వరి, బల్లే సాయికుమార్, బండారు లతాకుమారి, సీడీపీవో బ్యూలా తదితరులు పాల్గొన్నారు.

అపరాధ రుసుం లేకుండా గడువు పొడిగింపు

చింతలపూడి, ఫిబ్రవరి 17:స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నిర్వహిస్తున్న అంబేడ్కర్ ఓపెన్ యూనివర్సిటీ స్టడీ సెంటర్‌లో డిగ్రీ మొదటి సంవత్సరంలో చేరేందుకు గడువు తేదీ పొడిగించారని, అపరాధ రుసుము లేకుండా ఈనెల 29వ తేదీలోగా ఫీజు చెల్లించాలని కో-ఆర్డినేటర్ బి.శ్రీనివాసరావు తెలిపారు. మొదటి సెమిస్టర్ తరగతులు ఈనెల 4వ తేదీ నుంచి సజావుగా జరుగుతున్నాయని, ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు ప్రతీ ఆదివారం జరిగే ఈ అధ్యయన తరగతులకు విద్యార్థులు హాజరై సబ్జెక్టులలో సందేహాలను నివృత్తి చేసుకోవాలని సూచించారు.

ఉద్యోగ, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించాలి

పోలవరం, ఫిబ్రవరి 17: ఉద్యోగ ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలని ఐక్య కార్యాచరణ సమితి ఏఈ జేఏసీ ఆధ్వర్యంలో శనివారం పోలవరం తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. జలవనరులశాఖ కార్యాలయాల నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు నినాదాలు చేస్తూ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఏపీఎన్‌జీవో అధ్యక్షుడు బొంగు నాగేశ్వరరావు, ఎస్టీయూ అధ్యక్షుడు పోశిరావు, కార్యదర్శి శ్రీనుబాబు తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ డ్రోన్ల కోసం దరఖాస్తుల స్వీకరణ

టి.నరసాపురం, ఫిబ్రవరి 17 :వ్యవసాయ డ్రోన్‌ల కోసం రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తున్నట్టు వ్యవసాయ అధికారి డి.ముత్యాలరావు తెలిపారు. స్థానిక వ్యవసాయ అధికారి కార్యాలయంలో శనివారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ గ్రామస్థాయిలో రైతులు ఐదుగురు తక్కువ కాకుండా ఒక గ్రూపుగా ఏర్పడి పది శాతం నగదు చెల్లించి, 90శాతం నగదు బ్యాంక్ నుంచి రుణం పొందవచ్చని తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు వినియోగించుకోవాలన్నారు.

సంక్షిప్త సమాచారం..

- జంగారెడ్డిగూడెం, ఫిబ్రవరి 17: జంగారెడ్డిగూడెం పారిజాతగిరి వేంకటేశ్వరస్వామిని శనివారం భక్తులు దర్శించుకున్నారు. అన్నదాతలుగా హైదరాబాద్‌కు చెందిన అబ్బూరి రమణీకృష్ణ, జంగారెడ్డిగూడెంకు చెందిన తమ్మిశెట్టి కొండబాబు వ్యవహరించారు.
- ఏలూరు ఎడ్యుకేషన్ : జాతీయ రోడ్డు భద్రతా మాసోత్సవాల్లో బాగంగా శనివారం సీఆర్ఆర్ కళాశాలలో నెహ్రూ యువకేంద్ర స్వచ్ఛంద సంస్థ వలంటీర్లకు రోడ్డుభద్రతపై అవగాహన కార్యక్రమాన్ని మోటార్ వెహికల్స్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించారు.
- పోలవరం : పట్టిసీమ మహాశివరాత్రి ఉత్సవాల ఏర్పాట్లపై అధికారులు చేపడుతున్న కార్యక్రమ ప్రణాళికలపై జంగారెడ్డిగూడెం ఆర్డీవో అద్దయ్య మండల ప్రజాపరిషత్ కార్యాలయం వద్ద సమీక్ష సమావేశం నిర్వహించారు.
- జంగారెడ్డిగూడెం :పర్యావరణ పరిరక్షణ ప్రతి ఒక్కరి బాధ్యతని, నేటి యువత గుర్తించి నడుచుకోవాలని బడ్స్ అండ్ బ్లాసమ్స్ హైస్కూల్ హెడ్మిస్ట్రెస్ పీవీ వరలక్ష్మి అన్నారు. అవగాహన ర్యాలీ నిర్వహించారు.
- దెందులూరు : తపన సంస్థల అధినేత, బీజేపీ ఏలూరు ఎంపీ అభ్యర్థి తపన చౌదరికి వచ్చే ఎన్నికల్లో మద్దతు పలకాలని గోపన్నపాలెం, కొవ్వలి, దెందులూరు, చల్లచింతల పూడి గ్రామాల్లో శనివారం గాయకుడు అనంత శ్రీరామ్, జబర్దస్త్ టీమ్ సభ్యులు అదిరే అభి, అప్పారావు, బాబీ, వినోదిని, ఇమ్మాన్యూల్, అర్జున్ విజయ్ హాస్యభరిత ప్రదర్శనలతో ప్రచారం చేశారు.

20న 'పోలవరం' జిల్లా సాధనకు మహాధర్నా

పోలవరం, ఫిబ్రవరి 17 : పోలవరం కేంద్రంగా ప్రత్యేక గిరిజన జిల్లా ఏర్పాటు కోసం ఈనెల 20న స్థానిక ఏటుగట్టు సెంటర్‌లో ఏడువేల మందితో మహాధర్నా నిర్వహిస్తామని జిల్లా సాధన ఐక్య కార్యాచరణ సమితి నాయకులు తెలిపారు. శనివారం పోలవరంలో స్థానిక అభయాంజనేయస్వామి ఆలయం వద్ద జేఏసీ నాయకులు సంబంధిత కరపత్రాలను ఆవిష్కరించారు. ఐకాస కన్వీనర్ నాళం గాంధీ, వైసీపీ మండల కన్వీనర్ బుగ్గా మురళీకృష్ణ తదితరులు మాట్లాడుతూ మహాధర్నాకు గిరిజన మండలాల ప్రజలు తరలి రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఐటీడీఎస్ డైరెక్టర్ గంగు ఆనీల్, సొబ్బన మోహన్, పలు పార్టీల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి వసంత్‌కుమార్‌కు ఘన నివాళి

భీమడోలు, ఫిబ్రవరి 17 :ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ మంత్రి వట్టి వసంత కుమార్ ప్రథమ వర్ధంతి సందర్భంగా శనివారం ఆయన స్వగ్రామమైన ఎంఎంపురంలో పలువురు రాజకీయ ప్రముఖులు, ఉన్నతాధికారులు ఘనంగా నివాళులర్పించారు. కేంద్ర మాజీ మంత్రి పల్లం రాజు, ఉండవల్లి అరుణ్‌కుమార్, అంబటి రాంబాబు, కరాటం రాంబాబు, జెట్టి గురునాథం, పుప్పాల వాసుబాబు, గన్ని వీరాంజనేయులు, పచ్చమట్ల ధర్మరాజు, ఈలి నాని, బొలిశెట్టి శ్రీను, పలువురు అధికారులు ఆయన సేవలను కొనియాడారు.

104 ఉద్యోగి కుటుంబానికి ఆర్థిక సాయం


నగదు అందిస్తున్న 104 ఉద్యోగుల సంఘం

పోలవరం, ఫిబ్రవరి 17 : ఇటీవల ప్రమాదవశాత్తు మృతి చెందిన గూటాల గ్రామానికి చెందిన 104 ఉద్యోగి దేశాబత్తుల జోషి కుటుంబానికి శనివారం సీఐటీయూ ఆధ్వర్యంలో రాష్ట్రంలోని 104 ఉద్యోగుల సంఘం రూ.3,14,000 ఆర్థిక సాయం శనివారం అందించారు. యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఫణికు మార్, సీఐటీయూ ఏలూరు జిల్లా కార్యదర్శి డీఎన్‌వీడీ ప్రసాద్ మాట్లాడుతూ మొగల్తూరులో 104 సేవల్లో డేటా ఎంట్రీ ఆపరేటర్‌గా విధులు నిర్వహిస్తున్న జోషి రోడ్డు ప్రమాదంలో చెందడం దురదృష్టకరమన్నారు. యాజమాన్య ప్రతినిధులు గణేష్, మూర్తి, మూర్తిరాజు, విలియమ్స్, రవి కిషోర్ పాల్గొన్నారు.

ఖోఖో పంట అధిక దిగుబడిపై అవగాహన సదస్సు

ఏలూరు రూరల్, ఫిబ్ర వరి 17: సమగ్రనీరు, ఎరువుతో ఖోఖో పంట అధిక దిగుబడిని ఇస్తుందని పెదవేగి ఆయిల్‌పామ్ రీసె ర్చ్‌సెంటర్ ప్రిన్సిపల్ సైంటిస్ట్ ఎంవీ ప్రసాద్ అన్నారు. శనివారం స్థానికంగా జిందాల్ ఖోఖో, ప్రైవేట్ లిమిటెడ్ ఆధ్వర్యంలో ఖోఖో అధిక దిగుబడి సాధించే విధానంపై రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. శాస్త్రవేత్తలు డాక్టర్ దీప్తిశ్రీ, పెదవేగి హార్టికల్చర్ అధికారిణి ఎం.రత్నమాల రైతుల సందేహాలను నివృత్తి చేశారు. జిందాల్ ఖోఖో ప్రైవేట్ లిమిటెడ్ మార్కెటింగ్ మేనేజరు పంకజ్‌రావల్, ప్లాంట్ హెడ్ జోగ్రా, డాక్టర్ డి.వి.ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ మాదిగ భవన్ ప్రారంభం

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17: జంగారెడ్డిగూడెం రోడ్డులోని సుమారు రూ.25లక్షలతో నిర్మించిన డాక్టర్ బాబుజగ్జీవన్‌రామ్ మాదిగ భవన్‌ను శనివారం నగర మేయర్ షేక్ నూర్జహాన్‌తో కలిసి ఏలూరు ఎమ్మెల్యే ఆళ్ల నాని ప్రారంభించారు. నాని మాట్లాడుతూ ఈ భవనాన్ని మరింత ఆధునికీకరించేందుకు చేయూతను అందిస్తామన్నారు. వైసీపీ ఎంపీ అభ్యర్థి కారుమూరి సునీల్‌కుమార్, మున్నుల జాన్‌గుర్నాథ్, ఎస్ఎంఆర్ పెదబాబు పాల్గొన్నారు.

వైవీ రావు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలి

ఏలూరు రూరల్, ఫిబ్రవరి 17:ఏపీఎస్ ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడిగా పనిచేసిన వైవీ రావు పోరాట స్ఫూర్తిని ఆదర్శంగా తీసుకోవాలని పలువురు వక్తలు పిలుపునిచ్చారు. ఆర్టీసీ ఎంప్లాయీస్ యూనియన్ కార్యాలయ కపర్తి భవనంలో వై.వి.రావు ప్రథమ వర్ధంతిని శనివారం జరిగింది. సభకు ఏలూరు జిల్లా ఛైర్మన్ కె.వి రాఘవులు అధ్యక్షత వహించారు. తొలుత వైవీ రావు చిత్రపటానికి ఏపీ జేఏసీ అమరావతి ఉమ్మడి జిల్లా ఛైర్మన్ కె.రమేష్‌కుమార్, మన్నవ కృష్ణచైతన్య, బండి వెంకటేశ్వరరావు, బి.రాంబాబు నివాళులర్పించారు. ఏలూరు డిపో నాయకులు వీఎస్ నారాయణ, వాసు, బి.నారాయణస్వామి తదితరులు పాల్గొన్నారు.

భూ హక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలి

ఉంగుటూరు, ఫిబ్రవరి 17 :రైతులు, ప్రజలకు వ్యతిరేకంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన భూ హక్కుల చట్టాన్ని తక్షణమే రద్దు చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం కైకరం ప్రజా సంఘాల కార్యాలయంలో రైతులు, ప్రజలతో ఈ చట్టం వల్ల కలిగే నష్టంపై అవగాహన కల్పించారు. రాష్ట్ర ప్రభుత్వం జీవో నంబరు 512 పేరుతో తీసుకు వచ్చిన అంశం వల్ల రైతులకు కలిగే నష్టాన్ని వివరించారు. నాయకులు గుత్తికొండ వెంకట కృష్ణారావు, కొర్ని అప్పారావు, కోనే రాము, ఆకుల వీర్రాజు, వర్రి శ్రీరాములు పాల్గొన్నారు.

గ్రామ వలంటీర్లకు ఉద్యోగ భద్రత కల్పించాలి

కుక్కునూరు, ఫిబ్రవరి 17 :గ్రామ, వార్డు వలంటీర్లకు రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులుగా క్రమబద్ధీకరించాలని, రాజకీయ ప్రయోజనాలకు వారిని పావులుగా ఉపయోగించరాదని సీఐటీయూ మండల కార్యదర్శి సాయికిరణ్ డిమాండ్ చేశారు. శనివారం పార్టీ కార్యాలయంలో కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామ వలంటీర్లను ఎన్నికల విధుల్లో ప్రధాన బాధ్యతలు అప్పగించరాదని ఎన్నికల కమిషన్ చెప్పినప్పటికీ ముఖ్యమంత్రి మీరే నా బావి లీడర్‌లు అని సన్మాన సభలో వ్యాఖ్యానించడం అనుచితమన్నారు. ఈ వ్యాఖ్యలు ఓటర్లను ప్రలోభ పెట్టడానికే తప్ప మరొకటి కాదన్నారు. సమావేశంలో వలీ పాషా, రమేశ్ పాల్గొన్నారు.

బకాయి వేతనాలు చెల్లించాలి

ఏలూరుటూటౌన్, ఫిబ్రవరి 17:విలీన గ్రామాల ఉద్యోగులకు బకాయిపడిన వేతనాలు తక్షణమే చెల్లించాలని జోనల్ ఎంప్లాయీస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు డిమాండ్ చేశారు. ఈ మేరకు శనివారం అడిషనల్ కమిషనర్ చంద్రయ్యకు వినతిపత్రం సమర్పించారు. అనంతరం అప్పలరాజు మాట్లాడుతూ బకాయి వేతనాలు రూ.50 లక్షలు ఇవ్వాలన్నారు. జనవరిలో సమ్మె సందర్భంగా సంక్రాంతి పండుగకు అవుట్‌సోర్సింగ్ సిబ్బందికి ఒక్కొక్కరికి రూ.వెయ్యి చొప్పున ఇస్తామని వాగ్దానం చేశారన్నారు. అడిషనల్ కమిషనర్ స్పందిస్తూ మార్చిలో బకాయివేతనాలు చెల్లిస్తామన్నారు. సహాయ కార్యదర్శి ఎస్‌వీ.సుబ్బారావు, తదితరులు పాల్గొన్నారు.

పేద బ్రాహ్మణ కుటుంబానికి ప్రెస్‌క్లబ్ సాయం


సాయం చేస్తున్న ప్రెస్‌క్లబ్ సభ్యులు

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17 :పేదిరకంతో ఇబ్బందులు పడుతున్న బుట్టాయగూడెంకు చెందిన పేద బ్రాహ్మణ కుటుంబం అనిపెద్ది లక్ష్మీప్రభాకర్ శర్మ, ఉదయభవాని దంపతులకు బుట్టాయగూడెం ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో జర్నలిస్టులు శనివారం 50 కేజీల బియ్యం, నెలకు సరిపడా నిత్యావసర వస్తువులు, కూరగాయలు, రెండు వేల నగదు అందజేశారు. ప్రెస్‌క్లబ్ సేవా కార్యక్రమాలను ఏపీయూడబ్ల్యూజే జిల్లా కోశాధికారి జక్కుల దాసు, ఎగ్జిక్యూటివ్ మెంబరు కోడూరి ఆనంద్ అభినందించారు. ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో చేస్తున్న సేవలకు తమవంతు సహాయ సహకారాలను అందిస్తామని ప్రెస్‌క్లబ్ సభ్యులు తెలిపారు.

హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్చుచేయాలి

బుట్టాయగూడెం, ఫిబ్రవరి 17 : కేఆర్ పురం ఐటీడీఏ పరిధిలోని గిరిజన ప్రాంతంలో పనిచేస్తున్న 12 మంది కమ్యూనిటీ హెల్త్ వర్కర్లను ఆశాలుగా మార్పు చేయాలని, ఇతర సౌకర్యాలు కల్పించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎం.నాగమణి అధికారులకు విజ్ఞప్తి చేశారు. శనివారం కేఆర్ పురం ఐటీడీఏ ఏవో రామారావుకు సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని అందజేశారు. వేతన బకాయిలు చెల్లించాలన్నారు. కనీసం వేతనం పెంచాలని, యూనిఫాం, రికార్డు, మెడికల్ కిట్స్, టీఏ, డీఏలు ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో రామలక్ష్మి, జయలక్ష్మి, వెంకటలక్ష్మి, సామ్రాజ్యం తదితరులు పాల్గొన్నారు.



వైభవంగా రథోత్సవం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17: ఆగిరిపల్లి శోభనాచలుని రథోత్సవం వైభవంగా జరిగింది. దూర ప్రాంతాల నుంచి వేలాదిగా తరలివచ్చారు. మండల యాదవ, నగర సంఘాలు భక్తులకు ప్రసాద వితరణ చేశాయి. సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. శుక్రవారం ఆలయ కమిటీ భారీ అన్నసమారాధన నిర్వహించింది. ఆర్యవైశ్య కల్యాణ మండపం వద్ద ఆర్యవైశ్య యువకుల బిర్యానీ పంపిణీకి జనం పోటెత్తారు.



అపూర్వ సమ్మేళనం

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 17: పెదపాలుపర్రు జడ్పీ హైస్కూల్ పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక శనివారం జరిగింది. 1987 బ్యాచ్‌కు చెందిన వీరు కలుసుకుని నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. నాటి గురువులు చల్లగుళ్ల రామారావు, కల్యాణపు ప్రేమలతను సన్మానించారు.

ఆకట్టుకున్న సైన్స్ ఎక్స్‌పో

కైకలూరు, ఫిబ్రవరి 17: విద్యార్థుల్లో సృజనాత్మక శక్తిని నింపేందుకు సైన్స్ ఎక్స్‌పో ఎంతో దోహదపడుతుందని ప్రొఫెసర్ సుధాబత్తుల విజయకుమార్ అన్నారు. శనివారం కైకలూరు రవీంద్ర భారతి స్కూల్లో విజ్ఞాన ప్రదర్శన నిర్వహించారు. విద్యార్థుల నమూనాలు విశేషంగా ఆకట్టుకున్నాయి. ఇలాంటి ఎక్స్‌పోలు పరిశోధనలపై ఆసక్తి పెంచేలా చేస్తాయని, విజ్ఞాన శాస్త్రం ప్రాముఖ్యత తెలుస్తుందన్నారు. ప్రిన్సిపాల్ చిత్రాణి, ఏజీఎం కేశవరాజు, డీన్ శ్రీకాంత్, ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఓపీఎస్‌కు అనుకూల పార్టీలకే యూటీఎఫ్ మద్దతు



ముదినేపల్లి, ఫిబ్రవరి 17 : సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్ కు మద్దతు ఇచ్చే రాజకీయ పార్టీలకే రానున్న ఎన్నికల్లో ఉపాధ్యాయ వర్గాలు ఓటు చేయాలని యునైటెడ్ టీచర్స్ ఫెడరేషన్ ప్రాంతీయ సదస్సు తీర్మానించింది. శనివారం ముదినేపల్లి జడ్పీ హైస్కూలు ఆవరణలో జరిగిన కైకలూరు, కలిదిండి, మండవల్లి, ముదినేపల్లి మండలాల యూటీఎఫ్ ఉపాధ్యాయుల సదస్సు సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను అమలు చేయాలని డిమాండ్ చేసింది. యూటీఎఫ్ రాష్ట్ర మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి సుభాషిణి మాట్లాడుతూ సీపీఎస్ వల్ల ఉద్యోగులు, ఉపాధ్యాయులు ఆర్థిక ప్రయోజనాలను కోల్పోతున్నారని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందించటం లేదని విమర్శించారు. ఓపీఎస్‌ను అమలు చేస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే రాజకీయ పార్టీకే ఉపాధ్యాయుల మద్దతు ఉంటుందని యూనియన్ ఏలూరు జిల్లా అధ్యక్షుడు రుద్రాక్షి రవికుమార్ తెలిపారు. యూటీఎఫ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు స్వర్ణ రేఖ, జిల్లా ప్రధాన కార్యదిర్శ ముస్తాఫా ఆలీ, నాలుగు మండలాల అధ్యక్షులు పాల్గొన్నారు.

ఆక్రమణలను తొలగించకుంటే ఆమరణ దీక్ష

ముదినేపల్లి రూరల్, ఫిబ్రవరి 17: శ్రీహరిపురం పంచాయతీ పరిధిలో ఆక్రమణలను తొలగించకపోతే రెండు రోజుల్లో ఆమరణ దీక్షకు దిగుతానని శ్రీహరిపురం సర్పంచ్ పరసా విశ్వేశ్వరరావు హెచ్చరించారు. గ్రామంలోని పాత పంచాయతీ కార్యాలయం సమీపంలో పంచాయతీ స్థలంలో అక్రమంగా తూములు ఏర్పాటుచేసి ఆక్రమిస్తున్నారని చర్యలు తీసుకోవాలని అధికారులను కోరినా స్పందించలేదని రెండురోజుల్లో ఆక్రమణలు తొలగించకపోతే ఆమరణ దీక్ష చేస్తానని హెచ్చరించారు.



ఆత్మీయ సమావేశంలో భావోద్వేగానికి గురైన ముద్దరబోయిన

నా భవిష్యత్తును మీరే నిర్ణయించాలి

» టీడీపీ నూజివీడు ఇన్‌చార్జి ముద్దరబోయిన

నూజివీడు, ఫిబ్రవరి 17: రాష్ట్రానికి చంద్రబాబు ఎంత అవసరమో నూజివీడుకు ముద్దరబోయిన అవసరం అంత ఉందని, పలువురు తెలుగుదేశం పార్టీ నాయకులు స్పష్టం చేశారు. నూజివీడు నియోజకవర్గ టీడీపీ కార్యాలయంలో శనివారం పార్టీ ఇన్‌చార్జ్ మాజీ ఎమ్మెల్యే ముద్దరబోయిన వెంకటేశ్వరరావు ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పలువురు నాయకులు మాట్లాడుతూ నియోజక వర్గానికి ముద్దరబోయిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, ఆయనను మాకు ఇవ్వండి, గెలిపించి మీ దగ్గరకు పంపిస్తాం అంటూ సభా ముఖంగా చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు. ముద్దరబోయిన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం చంద్రబాబుని కలిసినప్పుడు మీ ట్రాక్ రికార్డు బాగున్నా కొన్ని అనివార్య పరిస్థితుల వల్ల టిక్కెట్ మార్చాల్సి వస్తోందని చెప్పారన్నారు. రెండు రోజులు సమయం తీసుకుని ఐ.వి.ఆర్ సర్వే ద్వారా నన్ను, మీరు టిక్కెట్ ఇవ్వదలచుకున్న అభ్యర్థి గురించి నియోజకవర్గంలో సర్వే చేసి, నాకు అనుకూలంగా ఉంటే ఫోన్ చేసి పిలవాలని ఆయనకి విజ్ఞప్తి చేశానన్నారు. నా రాజకీయ భవిష్యత్తును కార్యకర్తలుగా మీరే నిర్ణయించండి. మీ నిర్ణయమే నాకు శిరోధార్యం అంటూ భావోద్వేగానికి గురయ్యారు. అందరూ ఆయనను ఓదార్చారు. నాలుగు మండలాలు, పట్టణం నుంచి భారీ సంఖ్యలో కార్యకర్తలు, నాయకులు సమావేశానికి హాజరయ్యారు.



విస్తృతస్థాయి సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పార్థసారథి

నూజివీడులో టీడీపీ విజయమే లక్ష్యం

» ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి

ముసునూరు, ఫిబ్రవరి 17: రానున్న ఎన్నికల్లో నూజివీడులో టీడీపీ జెండాను ఎగురవేయటమే లక్ష్యమని పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి అన్నారు. శనివారం గోగులంపాడులో పార్టీ మండల అధ్యక్షుడు దేవినేని డలరామ్ అధ్యక్షతన పార్టీ మండల నాయకులు, కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశంలో ఆయన మాట్లాడుతూ వైసీపీ పనితీరుపై అసంతృప్తితోనే పార్టీని వీడినట్టు స్పష్టం చేశారు. టీడీపీ అధినేత చంద్రబాబును కలుసుకుని పెనమలూరు ఎమ్మెల్యేగా అవకాశం ఇవ్వమని అడిగానని, అయితే అక్కడ నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో ఆయన నూజివీడు వెళ్లి పనిచేసుకోమన్నారన్నారు. ఇక్కడ ఇన్‌చార్జ్‌గా ఉన్న ముద్దరబోయిన వెంకటేశ్వరరావుతో కలసి త్వరలో ఎన్నికల ప్రచారం నిర్వహించేలా అధిష్ఠానం చర్యలు తీసుకుంటోందన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులకు అందుబాటులో ఉంటానని, వారి సమస్యల పరిష్కారంతో పాటు నియోజకవర్గంలో నెలకొన్న ఇరిగేషన్, డ్రైనేజి ఇతర సమస్యలను సైతం టీడీపీ అధికారంలోకి రాగానే దశల వారీగా పరిష్కారానికి కృషి చేస్తానని పార్థసారథి పేర్కొన్నారు. టీడీపీ నాయకులు నూతక్కి వేణుగోపాలరావు, పర్వతనేని గంగాధర్, అట్లూరి రమేష్, చిలుకూరి వెంకటేశ్వరరావు, కొల్లి గంగారామ్, కాటేపల్లి శ్రీనివాసరావు, మామిడిశెట్టి గిరిబాబు, గద్దె రఘుబాబు తదితరులు పాల్గొన్నారు.



కైకలూరులో ఏపీఎన్జీవోల సంఘం నాయకుల దీక్షలు



నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగ సంఘాల దీక్షలు

27 చలో విజయవాడ విజయవంతం చేయాలి

కైకలూరు, ఫిబ్రవరి 17: ఉద్యోగ వర్గాలు ఈ నెల 27న చేపట్టిన చలో విజయవాడను విజయవంతం చేయాలని ఏపీఎన్జీవోల సంఘం నాయకుడు, కైకలూరు అధ్యక్షుడు కె. తాతారావు పిలుపునిచ్చారు. శనివారం ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక, పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోరుతూ ఏపీజేఏసీ ఐక్య వేదిక కైకలూరు శాఖ ఆధ్వర్యంలో నల్లబ్యాడ్జీలు ధరించి కైకలూరు తాలుకా సెంటర్లో రిలే దీక్షను నిర్వహించారు. ఈ దీక్షలో ఎన్జీవో సంఘ అధ్యక్షుడు మాట్లాడుతూ ఏపీజేఏసీ పిలుపు మేరకు చేపట్టిన ఉద్యమ కార్యాచరణ ప్రకారం డిమాండ్ల సాధనకు నిరసన కార్యక్రమాలు చేపడతామన్నారు. డీఏ బకాయిలు, పీఆర్సీల చెల్లింపులు, పెన్షనర్ల సమస్యలు పరిష్కరించే వరకు పోరాడతామన్నారు. షేక్ అబ్దుల్ హనీఫ్, యూటీఎఫ్ రాష్ట్ర సభ్యుడు ఎం. రవిశంకర్, పీఆర్టీయూ నాయకుడు జి. సముద్రుడు, పెన్షనర్ల సంఘం నాయకుడు ఎల్. రంగారావు, డీజే ప్రభాకరరావు, వై. వెంకటేశ్వరరావు, సీహెచ్. వీరాస్వామి తదితరులు పాల్గొన్నారు.

సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద నిరసన దీక్ష

నూజివీడు టౌన్: పెండింగ్ డీఏ విడుదల, 30 శాతం ఐఆర్ అమలు తదితర డిమాండ్ల సాధనకు ఏపీజేఏసీ పిలుపు మేరకు నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయం వద్ద ఉద్యోగులు, పెన్షనర్లు శనివారం దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా ఎన్జీవో అసోసియేషన్ నూజివీడు డివిజన్ అధ్యక్షుడు జి.శ్రీనివాసరావు మాట్లాడుతూ పీఆర్సీ బకాయిలను వెంటనే చెల్లించాలని, జీపీఎఫ్, సరెండర్ లీవ్, మెడికల్ లీవ్స్, రిటైర్మెంట్ బెనిఫిట్స్ వెంటనే చెల్లిం చాలన్నారు. ఎన్జీవో కార్యదర్శి టి.శ్రీనివాస్‌బాబు, ట్రెజరర్ ఎం.వెంకటేశ్వర రావు, ఉపాధ్యక్షులు పి.రాజబాబు, కె.సంగమయ్య, డి.సుబ్రహ్మణ్యం, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

ఓటర్లకు అవగాహన

మునునూరు, ఫిబ్రవరి 17: ఓటు వినియోగంపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ఎంఈవో సుబ్బారావు అన్నారు. శనివారం ముసునూరులో ఓటు హక్కు వినియోగం, నమోదుపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వెలుగు సిబ్బంది, అధికారులు గ్రామంలో ర్యాలీ నిర్వహించి ఓటు ఆవశ్యకతపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఓటుతో సమర్థవంతమైన నాయకత్వాన్ని ఎన్నుకుని అభివృద్ధికి బాటలు వేయాలని వారు కోరారు. వెలుగు ఏపీఎం బాబు, జూనియర్ అసిస్టెంట్ సన్నిరాజన్, వీవోఏలు తదితరులు పాల్గొన్నారు.

పల్లెర్లమూడిలో పల్లెకు పోదాం

నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17: కేంద్ర పథకాలు గ్రామాల్లో వివరిస్తూ బీజేపీని బలోపేతం చేయాలని ఆ పార్టీ నూజివీడు మండల అధ్యక్షుడు గోగినేని శ్రీనివాసకుమార్ అప్పారావు అన్నారు. పల్లెర్లమూడి, సీతారాంపురం గ్రామాల్లో పల్లెకుపోదాం కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రజలను గ్రామాల్లోని సమస్యలడిగి తెలుసుకున్నారు. మండల ఉపాధ్యక్షుడు కనిగంటి సాంబశివరావు, ఆగిరిపల్లి మండల అధ్యక్షుడు కొవ్వలి బాబురావు తదితరులు పాల్గొన్నారు.

చాట్రాయిలో వైద్య శిబిరం

చాట్రాయి, ఫిబ్రవరి 17: చాట్రాయి వికాస్ కళాశాలలో కృష్ణా మిల్క్ యూనియన్, రమేష్ అమరావతి హాస్పిటల్, అకీరా కంటి ఆసుపత్రి ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. శిబిరాన్ని కృష్ణామిల్క్ యూనియన్ పాలకవర్గ సభ్యులు బొట్టు రామచంద్రరావు, మేనేజరు టి.సాంబశివమూర్తి ప్రారంభించి మాట్లాడుతూ పాడి రైతులను ఆర్థికంగా అభివృద్ధి చేయటంతో పాటు వారికి ఉచిత సేవలను అందించేందుకు కృష్ణామిల్క్ యూనియన్ సిద్ధంగా ఉందన్నారు. వైద్యసిబ్బంది డాక్టర్ సాదిక్, డాక్టర్ కిషోర్, డాక్టర్ ప్రశాంత్‌బాబు, కోనేరు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడు కామినేని ఆత్మీయ సమావేశం

మండవల్లి, ఫిబ్రవరి 17: మాజీ మంత్రి డాక్టర్ కామినేని శ్రీనివాస్ ఈ నెల 18వ తేదీ సాయంత్రం మండవల్లి మండలం సింగనపూడి, ఉనికిలి గ్రామాల్లో ఆత్మీయ సమావేశం నిర్వహించనున్నట్లు టీడీపీ మండల నాయకుడు ముళ్లపూడి సత్తిబాబు తెలిపారు. భైరవపట్నం నుంచి టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు భారీ ర్యాలీగా ఆత్మీయ సమావేశంలో పాల్గొనేందుకు తరలివెళ్లనున్నట్లు సత్తిబాబు తెలిపారు.

రేషన్ బియ్యం స్వాధీనం

ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17: ఆగిరిపల్లిలో అక్రమంగా నిల్వ ఉంచిన రేషన్ బియ్యం గోదాముపై విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్సై రంజిత్ కుమార్ దాడి చేశారు. గ్రామానికి చెందిన మాజీ రేషన్ డీలర్ ఉలాస వెంకట్రావు ఇంట్లో 17 క్వింటాళ్ల 850 కిలోలు రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచటాన్ని గుర్తించి కేసు నమోదు చేశారు. ఆగిరిపల్లి డిప్యూటీ తహసీల్దార్ పవన్‌కుమార్ పాల్గొన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం పక్కదారి పడితే సహించేది లేదన్నారు.

'భోజనం' తనిఖీ

కలిదిండి, ఫిబ్రవరి 17 : మధ్యాహ్న భోజన పథకంలో నాణ్యత పాటించాలని ఎంఈవో ప్రభాకర్ బాబు వంట ఏజెన్సీ నిర్వాహకులను ఆదేశించారు. శనివారం పోతుమర్రు, పరమానందుని పేట ప్రభుత్వ పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించారు. భోజనం రుచిగా లేదని పోతుమర్రు పాఠశాల వంట ఏజెన్సీ నిర్వాహకులను మందలించారు. వంట షెడ్లను పరిశుభ్రంగా ఉంచాలని, మెనూ పాటించాలన్నారు.

పార్థసారథిపై రెండు చోట్ల సర్వే

నూజివీడు, ఫిబ్రవరి 17: పెనమలూరు ఎమ్మెల్యే కొలుసు పార్థసారథికి ఏలూరు జిల్లా నూజివీడు అసెంబ్లీ, ఉమ్మడి కృష్ణాజిల్లా పెనమలూరు అసెంబ్లీ టీడీపీ అభ్యర్థిత్వంపై శనివారం ఆ పార్టీ ఐవీఆర్‌ఎస్ సర్వే జరిపింది. చంద్రబాబు మాటల్లో 'మీ నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థిగా కొలుసు పార్థసారథి అయితే ఒకటి నొక్కండి, నోటా అయితే రెండు నొక్కండి' అని రెండు నియోజకవర్గాల్లో సర్వే జరపటం విశేషం. ప్రస్తుతం పార్థసారథి పెనమలూరు వైసీపీ ఎమ్మెల్యేగా ఉన్న విషయం తెలిసిందే. మూడు రోజులుగా పార్థసారథి నూజివీడు నియోజకవర్గంలోని పలు గ్రామాల్లో టీడీపీ కార్యకర్తలను కలుస్తూ చిన్న చిన్న సమావేశాల్లో పాల్గొంటున్నారు. కొన్ని కారణాల వల్ల నూజివీడుకు పార్థసారథిని పంపామని పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత సముచిత స్థానం లభిస్తుందని మాజీ ఎమ్మెల్యే, నూజివీడు నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి ముద్దరబోయినకు చంద్రబాబు హామీ ఇచ్చిన తరువాత తిరిగి నియోజకవర్గాల్లో సర్వే జరపటం పట్ల చర్చలు జోరుగా సాగుతున్నాయి.

బాల్య వివాహాలపై నిఘా ఉంచండి : ఆర్డీవో



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17: బాల్య వివాహాలపై నిఘా ఉంచాలని నూజివీడు ఆర్డీవో భవానీశంకరి అన్నారు. నూజివీడు సబ్ కలెక్టర్ కార్యాలయంలో బాల్య వివాహాల నిరోధంపై మహిళా సంరక్షణ కార్యదర్శుల అవగాహన సదస్సులో ఆమె మాట్లాడుతూ బాల్య వివాహాల నిరోధంపై ప్రధానంగా విద్యార్థినులకు అవగాహన కల్పించాలన్నారు. నూజివీడు డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ మాట్లాడుతూ 18 ఏళ్ల లోపు వివాహం చేస్తే సంబంధిత వివాహాన్ని ప్రోత్సహించిన వారిపై చర్యలు తీసుకుంటామని, దాదాపు రెండేళ్లకు పైగానే జైలు శిక్ష విధిస్తారన్నారు. గ్రామాల్లో వలంటరీ వ్యవస్థ ఉన్న దృష్ట్యా మహిళా సంరక్షణ కార్యదర్శులు నిరంతరం నిఘాతో బాల్య వివాహాలను అరికట్టాలన్నారు. చైల్డ్‌రైట్స్ కమిషన్ సభ్యుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ సెల్‌ఫోన్ ప్రభావంతో చిన్న తనంలోనే బాలబాలికలు వివాహం వైపు అడుగులు వేస్తున్న విషయాన్ని దృష్టిలో పెట్టుకోవాలన్నారు. బాల్య వివాహాలను నియంత్రించాలన్నారు. నూజివీడు సీడీపీవో షేక్ నూరానీ తదితరులు పాల్గొన్నారు.

నవదిన ప్రార్థనలు ప్రారంభం



నూజివీడు టౌన్, ఫిబ్రవరి 17: శిలువగట్టు తిరునాళ్ళ నేపథ్యంలో శనివారం నవదిన ప్రార్థనలను ప్రారంభించారు. నూజివీడు డీఎస్పీ సీహెచ్ మురళీకృష్ణ, నూజివీడు మున్సిపల్ చైర్‌పర్సన్ రామిశెట్టి త్రివేణిదుర్గ జెండా ఆవిష్కరించారు. పుణ్యక్షేత్రం ఫాదర్ జి.జోసఫ్ మాట్లాడుతూ దీవెనకరంగా నవదిన ప్రార్థనలు నిర్వహిస్తామన్నారు. నెహ్రూపేట విచారణకర్తలు, ఉత్సవ కమిటీ పాల్గొంది.

కృత్రిమ అవయవాల వితరణ



ఆగిరిపల్లి, ఫిబ్రవరి 17: హీల్ సంస్థ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా దివ్యాంగులకు హీల్ ప్యారడైజ్‌లోని ఎలిజబెత్, ప్యాన్‌టాన్, లెగసీ ఆఫ్ హోప్ కృత్రిమ అవయవ కేంద్రం పలువురికి కృత్రిమ కాళ్ళను అందజేసింది. అవయువాలు కోల్పోయిన వారికి ఆగిరిపల్లి మండలంలోని తోటపల్లి గ్రామంలో గల హీల్‌ప్యారడైజ్ కేంద్రం అండగా నిలుస్తుందని ముఖ్య అతిథిగా ఎం.వి నారాయణ అన్నారు. గుడివాడకు చెందిన విశ్రాంత ఉపాధ్యాయురాలు లాగిశెట్టి ద్రాక్షాయణి అందజేసిన విరాళంతో ఐదుగురికి కృత్రిమకాళ్ళు అందజేశారు. హీల్ వ్యవస్థాపక అధ్యక్షుడు కోనేరు సత్యప్రసాద్, డైరెక్టర్లు పిన్నమనేని కృష్ణమోహన్, కోనేరు రామారావు, యార్లగడ్డ అంకమ్మ చౌదరి, హీల్ పీఈవో కూరపాటి అజయ్‌కుమార్ పాల్గొన్నారు.

తామర పురుగులను నివారించండి

చాట్రాయి, ఫిబ్రవరి 17: మామిడిలో తామరపురుగుల నివారణకు మొదటి దశలో వేపనూనె పిచికారీ చేయాలని చాట్రాయి మండల ఉద్యానవనశాఖ అధికారిణి ఆర్.హేమ తెలిపారు. ఆరుగొలనుపేట, బూరగ్గూడెం, చనుబండ గ్రామాల్లో మామిడితోటలను ఆమె పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తామరపురుగులు మామిడి తోటల్లో కనిపిస్తున్నాయని, ఉధృతి అధికంగా ఉంటే స్పైనోసాడ్ 0.25 ఎంఎల్ లీటరు నీటికి లేదా థయోమిథాక్సామ్ 0.5 గ్రాములు లీటరు నీటికి లేదా ఫిప్రోనిల్ గోల్డ్ రెండు ఎంఎల్ లేదా ఇమిడాక్లోపిడ్ 0.3 ఎంఎల్ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలని సూచించారు.